**నేటి కందం- నేటికి అందం**

మన యాంధ్రుల కమరావతి
తనివారుచు నుండు రాజధానిగ ననుచున్
ఘనముగ ధృడ పరచుటకై
పనివడి కేంద్రమ్ము చట్టబద్ధత నొసగెన్ !!

(ఆంధ్రప్రదేశ్ కు శాశ్వత రాజధానిగా అమరావతి ఉంటుందని కేంద్రం పార్లమెంటులో బిల్లు పాస్ చేయించింది.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

**చురక**

ప్రతి పల్లెలో మరోసారి
ప్రజాపాలన ప్రగతిపథం
సర్కారుకు అవుతుందా
సమస్యలు అవగతం
భూ భారతి తెచ్చినా
భూ చిక్కులు ఎన్నేళ్లు
రెవెన్యూ చుట్టూ తిరిగే
రైతు కంట కన్నీళ్లు



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శుక్రవారం 3-4-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:183 పేజీలు:6 వెల: రూ.1/-

## కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తోంది

హైదరాబాద్, ఏప్రిల్ 2:ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2025–26 సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత నిధులు విడుదలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీల కోసం రూ.619.85 కోట్లు విడుదల చేయడాన్ని స్వాగతించారు కేంద్ర మంత్రి. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' మంత్రాన్ని అక్షరాలా ఆచరణలో పెడుతూ ప్రతి గ్రామం సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు.

కేంద్రం విడుదల చేసిన రూ.619.85 కోట్ల నిధుల్లో రూ.371.91 కోట్లు టైడ్ గ్రాంట్, రూ.247.94 కోట్లు అన్ టైడ్ గ్రాంట్ కింద ఉన్నాయన్నారు. టైడ్ గ్రాంట్ నిధులతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, వర్షపు నీరు సంరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల పెంపు వంటి అనేక పనులు చేయవచ్చున్నారు. అన్ టైడ్ గ్రాంట్ నిధులను మాత్రం స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభల్లో నిర్ణయం తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుకోవచ్చని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

కేంద్ర మంత్రి ప్రకటన ఇదే..

'15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం.. గ్రామీణ స్థానిక సంస్థలకు కేటాయించిన నిధులు కేంద్రం నుంచి రాష్ట్రాలకు అందిన వెంటనే ఆయా రాష్ట్రాల ఆర్థిక శాఖలు 10 పని దినాలలోపు సంబంధిత గ్రామ పంచాయతీలకు నిధులను వెంటనే బదిలీ చేయాల్సి ఉంటుంది. అంతకుమించి ఆలస్యం జరిగితే రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర పథకాల కోసం తీసుకున్న మార్కెట్ రుణాలు/రాష్ట్ర అభివృద్ధి రుణాల(రాఅఒ)పై చెల్లిస్తున్న వడ్డీ రేటు ప్రకారం గ్రామ పంచాయతీలకు వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే కేంద్రం విడుదల చేసిన నిధులకు సమానంగా మ్యాచింగ్ గ్రాంట్లు విడుదల చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. 2015–16 నుంచి 2019–20 వరకు 14వ ఆర్థిక సంఘం కింద రూ.5,060 కోట్లు విడుదల చేయగా.. 2020–21 నుంచి 2025–26 వరకు 15వ ఆర్థిక సంఘం కింద కేటాయింపులు 80 శాతం పెరిగి రూ.9,050 కోట్లకు చేరుకున్నాయి. దీంతో 14, 15వ ఆర్థిక సంఘాల కాలంలో కేంద్రం మొత్తం రూ.14,110 కోట్లు తెలంగాణకు కేటాయించింది. వీటిలో 2026 జనవరికి ముందే రూ.11,111 కోట్లు రాష్ట్రానికి కేంద్రం విడుదల చేసింది. 2024–25కు సంబంధించి 2026 జనవరి నుంచి ఇప్పటివరకు రూ.1,032.42 కోట్లను విడుదల చేసింది. తాజాగా 2025–26కు సంబంధించి రూ.619.85 కోట్లను మొదటి విడత కింద విడుదల చేసింది. ఇక, 16 ఆర్థిక సంఘం కింద 2026–27 నుంచి 2030–31 మధ్య కాలంలో తెలంగాణలోని గ్రామ పంచాయతీలు రూ.9,968 కోట్లను గ్రాంట్ రూపంలో కేంద్రం నుంచి పొందనున్నాయి.

తెలంగాణ ప్రభుత్వం సకాలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించని కారణంగా.. రెండేళ్ల పాటు (2023–24, 2024–25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన) నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగిన తర్వాత కేంద్రం వాటిని విడుదల చేసింది. తాజాగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత నిధులనూ కేంద్రం విడుదల చేసింది. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించాయి. అయినప్పటికీ.. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించగానే నిధులను విడుదల చేసింది. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలను రేండెళ్లపాటు నిర్వహించకుండా స్పెషల్ ఆఫీసర్ల పాలనతో రాష్ట్ర ప్రభుత్వం నెట్టుకొచ్చింది. ఇకపైనా ఎప్పటికప్పుడు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పిస్తే తదనుగుణంగా నిధులను విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అంటూ ప్రకటన జారీ చేశారు.

## రాజ్యసభలో బీఆర్ఎస్‌పై కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందన్నారు. కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగాయన్నారు. కాళేశ్వరం వల్ల ఉగయోగం లేదని నివేదికలు చెప్పాయని తెలిపారు. కాళేశ్వరం ప్రజల డబ్బుతో కట్టారా? లేక కేసీఆర్ సొంత డబ్బుతో కట్టారా అంటూ ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు.

వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి నిధులు తీసుకొని కాళేశ్వరం నిర్మించారని కేంద్ర మంత్రి తెలిపారు. భద్రాచలంలో ఉన్న గ్రామాలు ఏపీ పునర్విభజన చట్టంలో చేర్చారని... అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. ఎన్నికల ముందు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరిపి కేసీఆర్‌ను జైలుకు పంపిస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మాజీ సీఎంపై ఎందుకు విచారణ జరపలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిలదీశారు.

## హోర్ముజ్‌ను తెరిపించేందుకు చర్చలు.. భారత్‌కు యూకే ఆహ్వానం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు ప్రపంచ దేశాలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. ఈ విషయమై చర్చించేందుకు నేడు 35 దేశాలు సమావేశం కానున్నాయి. ఇందులో పాల్గొనాలంటూ భారత్‌ను తాజాగా యూకే ఆహ్వానించింది. ఈ విషయాన్ని భారత విదేశాంగ శాఖ గురువారం తెలిపింది. భారత్ తరఫున విదేశాంగ శాఖ సెక్రెటరీ విక్రమ్ మిస్రీ ఈ సమావేశంలో పాల్గొంటారని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. 'హోర్ముజ్‌పై చర్చల కోసం భారత్ సహా పలు దేశాలను యూకే ఆహ్వానించింది. మా తరఫున విదేశాంగ శాఖ సెక్రటరీ నేటి సాయంత్రం జరగనున్న సమావేశంలో పాల్గొంటారు' అని ఆయన తెలిపారు.

భారత్ ఇప్పటికే ఇరాన్‌తో పాటు ఇతర దేశాలతో ఈ విషయమై చర్చలు జరుపుతోందని రణధీర్ జైస్వాల్ తెలిపారు. హోర్ముజ్ మీదుగా సరకు రవాణాకు అంతరాయం కలగకుండా తమ వంతు ప్రయత్నాలను చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రయత్నాలు ఫలితాలను ఇస్తున్నాయని కూడా అన్నారు. భారత్‌కు చెందిన ఆరు నౌకలు సురక్షితంగా హోర్ముజ్‌ను దాటగలిగాయని అన్నారు.

తాజా సమావేశంలో భారత్‌తో పాటు ఫ్రాన్స్, జర్మనీ, కెనడా, జపాన్, ఇటలీ తదితర దేశాలు పాల్గొంటున్నాయని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిస్థితులను చక్కదిద్దేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను పరిశీలిస్తామని తెలిపారు.

హోర్ముజ్ జలసంధి మీదుగా ఎవరి ముడి చమురును వారే తెచ్చుకోవాలని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో తన ఆక్రోశం వెళ్లగక్కిన విషయం తెలిసిందే. ఎల్లకాలం అమెరికా సాయంగా రాదని అన్నారు. తాము సాయం కోరినప్పుడు ఇతర దేశాలు రాలేదని కూడా మండిపడ్డారు.

## 'రవాణా శాఖ ఆదాయం రూ.7097.38 కోట్లు.. వృద్ధి రేటు 2.70% '

హైదరాబాద్, ఏప్రిల్ 2:2025–26 వార్షిక సంవత్సరానికి రవాణా శాఖకు ఆదాయం రూ.7097.38 కోట్లు సమకూరిందని రాష్ట్ర రవాణా శాఖ ఒక ప్రకటన లో తెలిపింది. జీవిత కాలపు పన్నుల ద్వారా రూ.4714.63 కోట్లు త్రైమాసిక పన్నుల ద్వారా రూ.961.02 కోట్లు గ్రీన్ టాక్స్ ద్వారా రూ.78.35 కోట్లు ఫీజులు, సర్వీస్ చార్జీల ద్వారా రూ.820.09 కోట్లు తనిఖీల ద్వారా రూ.212.49 కోట్లు చలాన్ల ద్వారా రూ.310.80 కోట్లు సమకూరిందని రవాణా శాఖ తెలిపింది.తెలంగాణ పర్యాటకం 2025–26 వార్షిక సంవత్సరంలో ఏప్రిల్ నుండి డిసెంబర్ వరకు రూ.8535 కోట్లు ఆదాయ లక్ష్యం కాగా రూ.7097.38 కోట్లతో 83.16% సాధించామని రవాణా శాఖ పేర్కొంది . 2024–25 వార్షిక సంవత్సరంతో పోలిస్తే 2.70 % వృద్ధి రేటు సాధించామని రవాణా శాఖ తెలిపింది. 2025–26 సంవత్సరంలో 91,637 ఎలక్ట్రిక్ వాహనాల ద్వారా రూ. 769.81 కోట్ల జీవిత కాలపు పన్ను మినహాయింపు ఇచ్చామని రవాణా శాఖ వెల్లడించింది.

## నాగ్‌పూర్-ముంబై ఎక్స్‌ప్రెస్ వేపై టెంపోను ఢీకొన్న ట్రక్కు.. ఎనిమిది మంది మహిళలు మృతి

మహారాష్ట్ర, ఏప్రిల్ 2: మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక టెంపోను ట్రక్కు ఢీకొనడంతో ఎనిమిది మంది మహిళలు మరణించారు. ఈ ఘటన నాగ్‌పూర్-ముంబై ఎక్స్‌ప్రెస్ వేపై బుధవారం జరిగింది. మృతులంతా కూలీలే. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని జల్నా జిల్లాకు చెందిన 10 మంది మహిళా కూలీలు బుధవారం సాయంత్రం పని ముగించుకుని టెంపోలో ఇంటికి బయల్దేరారు.

ఈ క్రమంలో నాగ్‌పూర్–ముంబై ఎక్స్‌ప్రెస్ వేపై టెంపో బయల్దేరుతుండగా, వేగంగా వచ్చిన ట్రక్కు ఆ వాహనాన్ని ఢీకొంది. వాహనం ఢీకొనడంతో 10 మంది మహిళలతోపాటు డ్రైవర్‌కు కూడా తీవ్రగాయాలయ్యాయి. వీరిలో ఏడుగురు మహిళలు అక్కడికక్కడే మరణించారు. మిగతా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. కద్వాంచి గ్రామ సమీపంలో ఈ ఘటన జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. నలుగురు క్షతగాత్రులను చికిత్స కోసం జల్నాలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వీరిలో ఒకరు చికిత్స పొందుతూ మరణించారు. దీంతో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది.

మిగతా ముగ్గురికి చికిత్స కొనసాగుతోంది. బాధితులంగా జల్నా తహసీల్‌కు చెందినవారే. ఈ ఘటనకు బాధ్యుడైన ట్రక్కు డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌గ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు.

## చేనేత కార్మికులకు ఆర్డర్లు రద్దు చేయడంపై కల్వకుంట్ల కవిత ఆగ్రహం..

హైదరాబాద్, ఏప్రిల్ 2: కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల పొట్టకొడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. చేనేత కార్మికులకు ఇచ్చిన విద్యార్థుల యూనిఫాంల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేయడంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాల్సిన వారికి మేలు చేసేందుకే కార్మికులకు అన్యాయం చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు గుప్పించారు.

ఏటా సుమారు రూ.105 కోట్ల యూనిఫాంల ఆర్డర్ ఇచ్చేవారని.. ఇప్పుడు దాని రద్దుతో వేలాది మందికి ఉపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతల ఉపాధి సంక్షోభంలో పడిందని కవిత ధ్వజమెత్తారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాలపై తీవ్ర ప్రభావం చూపనుందని.. కార్మికులు వీధిన పడే దుస్థితి వచ్చిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ శాఖలకు చెందిన దుప్పట్లు, దుస్తులకు సంబంధించి రూ.200 కోట్ల ఆర్డర్లను కూడా తెలంగాణ చేనేతలకు ఇవ్వలేదని ఆరోపణలు గుప్పించారు.

టెస్కోకు ఆర్డర్లు ఇవ్వకుండా సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని రేవంత్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు కవిత. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కార్మికులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు కల్వకుంట్ల కవిత.

## ఇండియాపై పాకిస్తాన్ ఏదైనా దుస్సాహసానికి ఇండియా కఠినంగా స్పందిస్తుంది- రాజ్‌నాథ్ సింగ్ వార్నింగ్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:భారత్‌పై నిరంతరం కుట్రలకు తెరతీసే పాకిస్తాన్‌కు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటు వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పాకిస్తాన్ ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ఇండియా కఠినంగా స్పందిస్తుందని హెచ్చరించారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్ని ఆసరాగా చేసుకుని, ఇండియాపై పాకిస్తాన్ ఎలాంటి కుట్రలకు తెరతీసినా.. భారత్ నిర్ణయాత్మక చర్యలకు దిగుతుందన్నారు.

కేరళలో గురువారం జరిగిన సైనిక్ సమ్మాన్ సమ్మేళన్ కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాకిస్తాన్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా పూర్తి కాలేదన్నారు. యూరి దాడి తర్వాత సర్జికల్ స్ట్రైక్, పుల్వామా దాడి తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్.. ఇలా పాక్ దాడిచేసిన ప్రతిసారి గట్టి సమాధానం ఇచ్చాం అని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.

పహల్గాం దాడి జరిగి దాదాపు ఏడాది కావస్తోంది. గత ఏడాది ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 25 మంది పర్యాటకులు మరణించారు. అయితే, రాజ్‌నాథ్ సింగ్ తాజాగా పాకిస్తాన్‌పై చేసిన ఆరోపణలు ఆసక్తి కలిగిస్తున్నాయి.

పాకిస్తాన్ ఏదైనా కుట్రకు పాల్పడబోతుందని సమాచారం ఉందా అనే సందేహాలు మొదలయ్యాయి. పాక్ ఎలాంటి ప్రయత్నం చేస్తోందనేదానిపై రాజ్‌నాథ్ సింగ్ క్లారిటీ ఇవ్వలేదు. ఇటీవల ఇండియాపై పాకిస్తాన్ కూడా సంచలన ఆరోపణలు చేసింది. ఢిల్లీలో పట్టుబడిన పాకిస్తానీయులను అడ్డుపెట్టుకుని పాకిస్తాన్‌పై ఇండియా ఏదో ఆపరేషన్ ప్లాన్ చేస్తున్నట్లుందని అక్కడి మీడియా ఆరోపించింది. అయితే, ఈ ఆరోపణలకు ఎలాంటి ఆధారాల్ని పాక్ చూపలేకపోయింది.

## యుద్ధాన్ని ఆపేది లేదు.. అమెరికాకు అవమానం తప్పదు.. తేల్చిచెప్పిన ఇరాన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: అమెరికా, ఇజ్రాయెల్‌లకు ఇరాన్ భారీ హెచ్చరిక జారీ చేసింది. ఎట్టి పరిస్థితుల్లో యుద్ధాన్ని ఆపేది లేదని స్పష్టం చేసింది. అమెరికా బెదిరింపులకు లొంగబోమని తెలిపింది. యుద్ధం ముగింపుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రకరకాల ప్రకటనలు చేస్తున్న వేళ ఇరాన్ చేసిన ప్రకటన సంచలనం సృష్టిస్తోంది. ఈ మేరకు ఇండియాలోని ఇరాన్ ఎంబసీ తన సోషల్ మీడియా వేదికగా ఈ ప్రకటన చేసింది.

"మేం అమెరికా బాంబుల కారణంగా రాతియుగంలోకి వెళ్లడం లేదు. మాకు 7,000 ఏళ్ల నాగరిక చరిత్ర ఉంది. చరిత్రకు ఈ విషయం తెలుసు. అమాయకులైన పిల్లల్ని చంపి, అమానవీయ నేరాలు చేస్తున్న మీరు రాతియుగాన్ని ఆధునిక ప్రపంచంలోకి తెచ్చారు అనేది స్పష్టం" అని తన ట్వీట్‌లో పేర్కొంది. ఇరాన్‌తో యుద్ధంపై బుధవారం రాత్రి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. తాము ఇరాన్‌పై చేస్తున్న యుద్ధం కారణంగా ఆ దేశం రాతియుగంలోకి వెళ్తుందన్నారు. ఇరాన్ సైన్యం, నేవీ పూర్తిగా బలహీనపడిపోయాయని చెప్పారు. యుద్ధాన్ని రెండు, మూడు వారాల్లో ముగిస్తామన్నారు. అయితే, ఇరాన్ మిలిటరీ మాత్రం ట్రంప్ ప్రకటనకు ధీటుగా స్పందించింది. అమెరికాకు తీవ్ర అవమానం జరిగే వరకు యుద్ధాన్ని వదలేది లేదని, అమెరికా పశ్చాత్తాపపడి, లొంగిపోయే వరకు తమ దాడులు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఇరాన్ మిలిటరీకి నష్టం జరిగిందన్న అమెరికా ఆరోపణల్ని కూడా ఆ దేశం ఖండించింది.

అమెరికా తమను తక్కువగా అంచనా వేసిందని అభిప్రాయపడింది. ఇరాన్ సైనిక ప్రతినిధి ఒకరు ఈ వ్యాఖ్యలు చేశారు. తమ దేశం దగ్గరున్న సైనిక శక్తి, మిస్సైళ్ల తయారీ గురించి అమెరికా ఇంటెలిజెన్స్‌కు సరిగ్గా తెలియదన్నారు. లాంగ్ రేంజ్ అటాక్ మిస్సైల్స్ డ్రోన్లు, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, స్పెషలైజ్డ్ ఎక్విప్‌మెంట్ వంటివి తమ దేశం దగ్గరున్నాయని ఇరాన్ ప్రతినిధి మీడియాతో తెలిపారు.

## ప్రేమ వివాహం.. నెలరోజులకే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సూసైడ్

హైదరాబాద్, ఏప్రిల్ 2: మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నవవధువు ఆత్మహత్య కలకలం రేపుతోంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న నెల రోజులకే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బలవన్మరణానికి పాల్పడింది. 2020లో సోషల్ మీడియా ద్వారా బీహార్‌కు చెందిన ఇషికా యాదవ్, మధ్యప్రదేశ్‌కు చెందిన నీరాజ్ బన్సల్‌కు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారడంతో ఫిబ్రవరి 20, 2026న పెద్దల సమక్షంలో ఇరువురూ వివాహం చేసుకున్నారు.

మియాపూర్‌లోని మక్త మహబూబ్‌పేట్‌లోనీ ఓ అపార్ట్‌మెంట్‌లో ఇషిక, నీరజ్ నివాసముంటున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ భార్యాభర్తలు ఇద్దరూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొంతకాలంగా అదనపు కట్నం విషయంలో ఇరువురి మధ్య గొడవలు జరిగినట్లు తెలుస్తోంది. భర్త వేధింపులు తట్టుకోలేక తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఇషిక ఆత్మహత్య చేసుకుంది. భర్త ఇచ్చిన సమాచారంతో మియాపూర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రాజధాని అమరావతిని వ్యతిరేకించిన ఏకైక పార్టీ వైసీపీ: సీఎం చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 02: రాజధాని అమరావతి బిల్లుకు చట్టబద్ధత చరిత్రాత్మకమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. చరిత్ర ఉన్నంత వరకు అమరావతి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో ఏపీ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు–2026 ఏకగ్రీవంగా ఆమోదం పొందింది.

ఈ నేపథ్య ంలో గురువారం రాజధాని ప్రాంతంలోని ఉద్దండరాయునిపాలెం గ్రామంలో సంబరాలు జరిగాయి. ఈ సంబరాల్లో సీఎం చంద్రబాబు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రాజధానిపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మూడు ముక్కలాట ఆడారని మండిపడ్డారు.

ఆ కుట్రలు దాటుకుని అమరావతిని సాధించుకున్నామని సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల ఆత్మగౌరవానికి చిహ్నం అమరావతి అని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేశంలోని అన్ని పార్టీలు.. ఈ బిల్లుకు మద్దతు తెలిపాయని వివరించారు. బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని పార్టీలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఏపీ ప్రజల తరఫున ప్రధాని మోదీకి ధన్యవాదాలు సీఎం చంద్రబాబు తెలిపారు.

రాజధాని అమరావతిని వ్యతిరేకించిన ఏకైక పార్టీ వైసీపీ అని సీఎం చంద్రబాబు చెప్పారు. ముళ్ల కంచెలు దాటుకుని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సంఘీభావం తెలిపారని పేర్కొన్నారు.

## గొడవ నేపథ్యంలో.. భార్య ముక్కు, చెంప కొరికిన భర్త

లక్నో,ఏప్రిల్ 2: భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో భార్య ముక్కు, చెంపను భర్త గట్టిగా కొరికాడు. దీంతో భార్య ముక్కు, చెంపకు తీవ్ర గాయమైంది. డాక్టర్లు పది కుట్లు వేశారు. ఆ మహిళ సోదరుడి ఫిర్యాదుతో ఆమె భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని హమీర్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. పానా అనే మహిళకు చాలా ఏళ్ల కిందట ఫూల్‌తో వివాహమైంది. అయితే భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి.

కాగా, ఇటీవల రాత్రి వేళ ఆ దంపతుల మధ్య తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది. ఆగ్రహించిన ఫూల్ తన భార్య పానా ముక్కు, చెంపపై గట్టిగా కొరికాడు. దీంతో ఆమె ముక్కు పైభాగం తెగి ఊడిపోయింది.

చెంపలపై లోతైన గాయాలయ్యాయి. ఈ దాడి తర్వాత ఇంటి నుంచి భర్త పారిపోయాడు.

మరోవైపు పానా కుటుంబ సభ్యులు తొలుత సమీపంలోని ఆసుపత్రికి ఆమెను తరలించారు. దీంతో ముక్కు, చెంప గాయాలకు డాక్టర్లు పది కుట్లు వేశారు. మెరుగైన చికిత్స కోసం ఝాన్సీలోని మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. పానా ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నదని అక్కడి డాక్టర్లు తెలిపారు.

# శాంతి, కరుణ, ఆశ, విశ్వాసం, విమోచనను తెస్తుంది గుడ్ ఫ్రైడే

## (03 ఏప్రిల్ "గుడ్ ఫ్రైడే" సందర్భంగా)

05 ఏప్రిల్ 2026 నాడు ఈస్టర్ జరుపుకోవడం, ఆ పండుగకు ముందు వచ్చే శుక్రవారం, అనగా 03 ఏప్రిల్ రోజున ప్రపంచవ్యాప్తంగా 'గుడ్ ఫ్రైడే'ను జరుపుకుంటారు. క్రైస్తవ మతంలో గుడ్ ఫ్రైడేకు ప్రత్యేక స్థానం ఉంది. యేసు క్రీస్తు శిలువ వేయబడడం, మరణాన్ని స్మరించుకోవడం క్రైస్తవ మతంలో అత్యంత ముఖ్యమైన గడియలుగా గుడ్ ఫ్రైడేను జరుపుకొంటారు. శిలువపై ఏసు పడిన బాధలకు, ఆయన మరణానికి ప్రతీకగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాసాలు, మౌన వ్రతాలు, ధ్యానాల ద్వారా ప్రభువును స్మరించుకుంటారు. దుఃఖం, పశ్చాత్తాపం, స్మరణలకి సంబంధించిన ఒక గంభీరమైన రోజుగా పాటించడం కొనసాగుతున్నది. యేసు క్రీస్తు త్యాగం, విమోచన, క్షమాపణ, నిరీక్షణలను గుడ్ ఫ్రైడే మోసుకువస్తుందని క్రైస్తవ మతస్థులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. దీనినే దుఃఖకరమైన శుక్రవారం"గా కూడా భావిస్తారు.

### గుడ్ ఫ్రైడే ఉత్సవం కాదు, బాధలకు చిహ్నం:

"గుడ్ ఫ్రైడే"లోని 'గుడ్' అనే పదం సంతోషానికి సంబంధించినది కాదు. ఇది మానవాళి కోసం క్రీస్తు పడిన బాధలకు చిహ్నంగా, పవిత్ర వారంలో ఒక భాగంగా తీసుకోవాలి. దీని తర్వాత వచ్చే ఈస్టర్ సండే పండుగ యేసు పునరుత్థాన వేడుక వస్తుంది. గుడ్ ఫ్రైడే రోజు ఉత్సవాలు ఉండవు, దానికి బదులుగా వినయం, ప్రార్థన, ఉపవాసాలతో ఆధ్యాత్మిక చింతనతో పాటిస్తారు. గుడ్ ఫ్రైడే అనేది దుఃఖం, ప్రార్థనల రోజు కాగా, ఈస్టర్ అనేది ఆనందం, ఆశల పండుగ. గుడ్ ఫ్రైడే రోజున క్రీస్తు శ్రమల వృత్తాంతాన్ని చదవడం, శిలువను ఆరాధించడం, దివ్య సత్ప్రసాదం స్వీకరించడం, ప్రత్యేక చర్చి సేవలు, మూడు గంటల పాటు ప్రత్యేక నిశ్శబ్ద ప్రార్థనలు, ధ్యానాలు, విషాద గీతాల ఆరాధనలు, సాదా బలిపీఠ అమరికలు వంటివి చేర్చబడతాయి.

మానవాళి జీవితాల్లో శాంతి, ఆశ, విశ్వాసం, కృప, త్యాగం, వినయం నిండాలని ప్రార్థిస్తూ జరుపుకునే గుడ్ ఫ్రైడే మనందరికీ శుభాన్ని కలిగించాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేద్దాం. యేసు ప్రభువు త్యాగం మన హృదయాల్లో కరుణ, విశ్వాసాలను ప్రేరేపించాలని కోరుకుందాం. ఆత్మ పరిశీలన, ఆశల ఆశీర్వాదాలు ఇవ్వాలని వేడుకుందాం.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# కొనసాగుతున్న పశ్చిమాసియా సంఘర్షణ దృష్ట్యా తీసుకుంటున్న చర్యలను సమీక్షించేందుకు పీఎం అధ్యక్షతన సీసీఎస్ సమావేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణల నేపథ్యంలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన లోక కల్యాణ్ మార్గ్, 7లో భద్రతపై క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశం జరిగింది. దీనిలో వివిధ మంత్రిత్వ శాఖలు/విభాగాలు చేపట్టిన చర్యలను సమీక్షించి, తదుపరి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

పెట్రోలియం ఉత్పత్తులు ముఖ్యంగా ఎల్ఎన్జీ/ఎల్పీజీ సరఫరాకు, తగినంత విద్యుత్తు అందుబాటులో ఉంచేందుకు చేపట్టిన చర్యల గురించి మంత్రి వర్గ కార్యదర్శి వివరించారు. కొత్తగా వివిధ దేశాల నుంచి వస్తున్న దిగుమతులతో ఎల్పీజీ సేకరణ వనరులను వైవిధ్యపరుస్తున్నారు. అదే విధంగా, ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్జీ) కూడా వివిధ దేశాల నుంచి దిగుమతి అవుతోంది. గృహ వినియోగదారులకు ఎల్పీజీ ధరలు యథాతథంగా ఉన్నాయని కార్యదర్శి తెలిపారు. అదే విధంగా, ఎల్పీజీ అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్లో విక్రయాలను నిరోధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్లను విస్తరించే కార్యక్రమాలను కూడా చేపట్టారు. వేసవిలో డిమాండు ఎక్కువగా ఉండే నెలల్లో తగినంత విద్యుత్తును అందుబాటులో ఉంచేందుకు 7 నుంచి 8 గిగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం ఉన్న గ్యాస్ ఆధారిత విద్యుత్తు కేంద్రాలకు గ్యాస్ పూలింగ్ విధానం నుంచి మినహాయింపు, థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో మరింత బొగ్గు నిల్వ చేసుకొనేందుకు ర్యాకుల ఏర్పాటు, తదితరమైన చర్యలు తీసుకుంటున్నారు.

అంతే కాకుండా.. వ్యవసాయం, పౌర విమానయానం, నౌకారవాణా, సరకు రవాణా తదితర రంగాల్లో తలెత్తుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రతిపాదించిన చర్యలపై చర్చించారు.

ఎరువుల సరఫరాకు భరోసానిచ్చేలా అవసరాలకు అనుగుణంగా యూరియా ఉత్పత్తిని కొనసాగించడం, డీఏపీ/ఎన్పీకేఎస్ సరఫరాదారుల కోసం విదేశీ సరఫరాలను సమన్వయం చేసుకోవడం లాంటి ప్రయత్నాలు చేపడుతున్నారు. రోజువారీ పర్యవేక్షణ, దాడులు, కఠిన చర్యల ద్వారా బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలను, ఎరువుల మళ్లింపును అరికట్టాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

గత నెల రోజులుగా ఆహార పదార్థాల ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ధరలు, నిత్యావసర వస్తువుల చట్టం అమలుపై నిరంతర పర్యవేక్షణకు, రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలతో సంప్రదింపుల కోసం కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయలు, పండ్ల ధరలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

మన ఇంధన వనరులు, ఎరువులు, ఇతర సరఫరా వ్యవస్థలను అంతర్జాతీయంగా వైవిధ్యీకరించేందుకు చర్యలు చేపడుతున్నారు. అలాగే, హర్మూజ్ జలసంధి గుండా నౌకల సురక్షిత ప్రయాణానికి అంతర్జాతీయ చర్యలు, దౌత్య ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

కొనసాగుతున్న సంక్షోభం నేపథ్యంలో మెరుగైన సమన్వయానికి, ఎప్పటికప్పుడు సమాచారం అందించడానికి, కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో సమాచార ప్రసారానికి, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

సామాన్య ప్రజలకు అత్యవసర వస్తువుల లభ్యతపై ప్రధాన మంత్రి సమీక్షించారు. దేశంలో అందుబాటులో ఉన్న ఎరువులు, ఖరీఫ్, రబీ కాలాల్లో వాటి లభ్యతను నిర్ధారించడానికి చేపట్టిన చర్యల గురించి చర్చించారు. ఈ సంక్షోభం ప్రభావం నుంచి ప్రజలను రక్షించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు. అసత్య వార్తలను, వదంతుల ప్రచారాన్ని నిలువరించేందుకు ప్రామాణిక సమాచారం ప్రజలకు అందించాలని స్పష్టం చేశారు.

కొనసాగుతున్న అంతర్జాతీయ పరిణామాల వల్ల ప్రభావితమైన పౌరులు, వివిధ రంగాల సమస్యలను పరిష్కరించేందుకు సాధ్యమైన అన్ని చర్యలను చేపట్టాలని ప్రధానమంత్రి ఆదేశించారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి..

### -ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ..



అమరావతి, ఏప్రిల్ 2:జిల్లా కేంద్రంలోని నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను జిల్లా కలెక్టర్ రాజకుమారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగంతో పాటు ఇన్పేషెంట్, ఔట్పేషెంట్ ఓపీ, రిజిస్ట్రేషన్ బ్లాక్, మెడికల్ ఎమర్జెన్సీ వార్డులను పరిశీలించా రు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు.

రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రిలో శుభ్రత, సమయపాలన, సేవల నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేసారు. ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడం ప్రతి వైద్యుడి బాధ్యత అని సూచించారు. అలాగే, రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సేవలను మరింత మెరుగుపరచాలని, అత్యవసర సేవలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

# ఆటిజాన్ని అర్థం చేసుకుందాం.. ఆత్మీయతను పంచుదాం

### -ప్రత్యేకతను ప్రోత్సహిస్తే ప్రతిభ వికసిస్తుంది..

### -వరల్డ్ ఆటిజం అవేర్నెస్ డే కార్యక్రమంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



అమరావతి, ఏప్రిల్ 2:ఆటిజాన్ని సరైన విధంగా అర్థం చేసుకొని.. చిన్నారులకు ఆత్మీయత పంచుదామని, ప్రతి వ్యక్తికి ప్రత్యేకమైన సామర్థ్యాలు ఉంటాయని, ఆ ప్రత్యేకతలను గుర్తించి ప్రోత్సహిస్తే వారు జీవితంలో మెరుగైన స్థాయికి చేరుకుంటారని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. వరల్డ్ ఆటిజం అవేర్నెస్ డే సందర్భంగా గురువారం నగరంలోని ఆయోధ్యనగర్లో గల చేయూత మానసిక దివ్యాంగుల శిక్షణ సంస్థలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్పై జరిగిన అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హాజరయ్యారు. చిన్నారుల క్షేమసమాచారాన్ని, వారి ప్రత్యేక అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆటిజం అనేది లోపం కాదని, అది ఒక ప్రత్యేకమైన స్థితి మాత్రమేనని, సరైన శిక్షణ, మద్దతు ఉంటే వారు కూడా సమాజంలో సమానంగా ఎదగగలరని తెలిపారు. ఆటిజం ఉన్నవారి అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోందని.. అదేవిధంగా 20 ఏళ్లుగా చేయూత డైరెక్టర్ డా. టి.కృష్ణకుమారి చేస్తున్న కృషి ప్రశంసనీయమైనదని పేర్కొన్నారు. ఆటిజం చిన్నారులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలతో పాటు క్రీడలు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, స్విమ్మింగ్ తదితరాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. చేయూత పిల్లల కళాత్మక ప్రదర్శనలు, వేస్ట్ మెటీరియల్, న్యూస్ పేపర్లతో చేసిన గిఫ్ట్ ఐటెమ్స్ను పరిశీలించి ప్రతిభను ప్రోత్సహించారు. చిన్నారులకు ఇచ్చే ప్రత్యేక శిక్షణ విషయంలో అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తామని డా. కృష్ణకుమారికి తెలిపారు.

# జనాభా లెక్కల సమాచార పత్రాన్ని స్వయంగా పూర్తి చేసిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:గృహాల జాబితా, గృహ గణనతో కూడిన 'జనగణన 2027' మొదటి దశ ప్రారంభానికి సూచికగా ఈ రోజు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన సమాచార పత్రాన్ని పూర్తి చేశారు. తొలిసారిగా డిజిటల్ పద్ధతిలో డేటా సేకరణ జరుగుతున్న జనగణన ఇదేనని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రజలు కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేలా ఉన్న ఈ విధానం భారతీయులకు సాధికారతను కల్పిస్తుందని ఆయన తెలిపారు. దేశ ప్రజలంతా కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవాలని.. తద్వారా జనగణన ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో ప్రధానమంత్రి ఈ విధంగా పేర్కొన్నారు:

"గృహాల జాబితా, గృహ గణనకు సంబంధించిన 'జనగణన 2027' మొదటి దశ ఈ రోజు ప్రారంభమవుతోంది.

తొలి సారిగా డిజిటల్ మాధ్యమాల ద్వా రా డేటా సేకరణ జరుగుతున్న జనగణన ఇదే. ఇది భారతీయులు కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేలా వారికి సాధికారతను కల్పిస్తుంది.

కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకొని ఈ జనగణన ప్రక్రియలో పాల్గొనాలని నేను ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను."

# ఎన్ఈపీ- 2020 తో భారత్ కుతూహలాన్నీ, సంపూర్ణ అభివృద్ధినీ నిరంతరం ప్రోత్సహిస్తోందని వివరించిన వ్యాసాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:కేంద్ర మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ రాసిన ఒక వ్యాసాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రజలతో ఈ రోజు పంచుకున్నారు. జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)- 2020లో భాగంగా మౌలిక అక్షరాస్యతపైనా, విద్యార్థులు ఉల్లాసంతో చదువుకోవడంపైనా భారత్ అమితంగా దృష్టి సారిస్తూ కుతూహలాన్నీ, సంపూర్ణ అభివృద్ధినీ నిరంతరం ప్రోత్సహిస్తోందని మంత్రి ఆ వ్యాసంలో వివరించారు. బడిలో మొదటి రోజును ఒక ఆరంభంగా మాత్రమే కాకుండా దానిని విద్యార్థుల ఉమ్మడి జాతీయ బాధ్యతగా చూస్తూ, ఆ బాధ్యతను మనసు లోలోపలకు ఇముడ్చుకోవాలని శ్రీ మోదీ అన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో శ్రీ మోదీ ఒక సందేశాన్ని పొందుపరుస్తూ:

''బడిలో మొదటి రోజు కేవలం ఒక ఆరంభం కాదు... అది విద్యార్థుల మధ్య ఓ ఉమ్మడి జాతీయ బాధ్యత.. ఈ బాధ్యతను విద్యార్థులు తమ మనసు లోలోపలకు ఇముడ్చుకోవాల్సిన అవసరం ఉంది. ఎన్ఈపీ-2020లో భాగంగా, మౌలిక అక్షరాస్యతతో పాటు విద్యార్థులు ఉల్లాసంతో చదువుకోవడంపైనా భారత్ అమితంగా దృష్టి కేంద్రీకరిస్తూ వారిలో కుతూహలాన్నీ, సంపూర్ణ అభివృద్ధినీ నిరంతరం ప్రోత్సహిస్తోంది.

దీనిపై మరిన్ని విషయాలను తెలుసుకోవడానికి కేంద్ర మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ రాసిన ఈ వ్యాసాన్ని చదవండి'' అని పేర్కొన్నారు.

# గుజరాత్లోని వావ్-థరాడ్లో జరిగిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసంగానికి సంబంధించిన విశేషాలను పంచుకున్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:ఉత్తర గుజరాత్లో సుమారు రూ.20,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేందుకు బనస్కాంత జిల్లాలోని వావ్-థరాడ్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభను ఉద్దేశించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. పవిత్రమైన నవరాత్రి వేడుకలు ముగిసే రోజున భగవాన్ మహావీర్ జయంతి కావటంపై ప్రధానమంత్రి మాట్లాడుతూ.. మాతా అంబాజీకి, భగవాన్ శ్రీ ధరణీధర్కు గౌరవపూర్వక ప్రణామాలు అర్పించారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లోని వరుస పోస్టుల్లో శ్రీ నరేంద్ర మోదీ ఇలా పేర్కొన్నారు.

''నేను దీసా వైమానిక కేంద్రంలో ల్యాండ్ అవటం వల్ల ఇవాల్టి వావ్-థరాడ్ పర్యటన మరింత ప్రత్యేకంగా అనిపిస్తోంది".

"జాతీయ భద్రతపై కాంగ్రెస్ నిర్లక్ష్యం కారణంగా దీసా ప్రాజెక్టు చాలా కాలంపాటు నిలిచిపోయింది.

ప్రాధాన్యతా ప్రాతిపదికన మేం దీన్ని పూర్తి చేశాం. ఇది ఈ ప్రాంతానికే కాక, దేశానికీ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది".

''వావ్-థరాడ్ సహా ఈ ప్రాంతానికి సంబంధించి నాకు ఎన్నో జ్ఞాపకాలున్నాయి. ఇక్కడి ప్రజలు ముఖ్యంగా తల్లులు, అక్కాచెల్లెళ్లు చూపిన ఆప్యాయతను ఎప్పటికీ మర్చిపోలేను".

''సౌర విద్యుత్ రంగంలో నేడు గుజరాత్ పతాకం రెపరెపలాడుతోంది. ప్రపంచంలోనే పునరుత్పాదక ఇంధనానికి ప్రధాన కేంద్రంగా మన రాష్ట్రం అవతరించే రోజు ఎంతో దూరంలో లేదు".

''కాంగ్రెస్ పాలనలో అల్లకల్లోలం, పేదరికంతో కొట్టుమిట్టాడిన ఉత్తర గుజరాత్ నేడు అభివృద్ధిలో సరికొత్త చరిత్రను లిఖిస్తోంది. ఇక్కడ మేం చేపడుతున్న పనులతో వావ్-థరాడ్, బనస్కాంత, పటాన్, మెహసానా ప్రాంతాలకు ప్రయోజనం చేకూరుతుంది".

"యుద్ధం కారణంగా ప్రపంచ సంక్షోభంలోనూ భారత్ ను ద్వేషించే విదేశీ శక్తుల భాషలో కాంగ్రెస్ మాట్లాడటం దురదృష్టకరం. వారి కుట్రల పట్ల మనం అప్రమత్తంగా ఉండాలి"

# యువికా ద్వారా అంతరిక్ష రంగంలో ప్రతిభను ముందుగానే గుర్తించడంపై ప్రభుత్వం దృష్టి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:దేశంలోని యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూ విజ్ఞాన శాఖ, పీఎంఓ, సిబ్బంది వ్యవహారాలు, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి. అంతరిక్ష శాఖల సహాయ మంత్రి (స్వతంత్ర) డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. పాఠశాల విద్యార్థులు అంతరిక్ష విజ్ఞాన రంగంలో వృత్తిని చేపట్టేలా ప్రోత్సహించడంలో 'యువ విజ్ఞాని కార్యక్రమం' (యువికా) కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా లోక్సభలో ఎంపీ శ్రీమతి అనితా నగర్సింగ్ చౌహాన్ అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. విద్యార్థుల్లో చిన్న వయసులోనే అంతరిక్ష శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించేలా 'యువికా'ను రూపొందించినట్లు మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా 9వ తరగతి చదువుతున్న విద్యార్థులే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోందని కేంద్రమంత్రి వివరించారు.

అంతరిక్ష శాస్త్రం, సాంకేతికత, వాటి అన్వయాలపై విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. కేవలం నేర్చుకోవడమే కాకుండా, భవిష్యత్తులో అంతరిక్ష శాస్త్రాన్ని ఒక వృత్తిగా ఎంచుకునేలా విద్యార్థులను ప్రోత్సహించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఆయన తెలిపారు. విద్యార్థుల ఎంపిక ప్రక్రియ గురించి మంత్రి వివరిస్తూ.. విద్యా అర్హతలను ఆన్లైన్లో పరిశీలించి, ఆ తరువాత ఆన్లైన్ క్విజ్ పోటీలో వారి ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

# ఇకనుంచి మన రాజధాని అమరావతి..

### -అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్సభ ఆమోదం చారిత్రాత్మకం



అమరావతి, ఏప్రిల్ 2:అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా గుర్తింపు ఇవ్వాలని రాష్ట్ర విభజన జరిగినప్పటినుండి చేసిన ప్రయత్నాలు ఫలించి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని చట్టబద్ధత కల్పించే బిల్లు లోక్సభలో ఆమోదం పొందడం చారిత్రాత్మకమని ఆంధ్ర రాష్ట్ర ప్రజలు గర్వించదగ్గ విషయమని మరూరు సొసైటీ చైర్మన్ గోపాల్ నాయుడు పేర్కొన్నారు. రాప్తాడు మండలంలో టిడిపి నాయకులు కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించి సంబరాలు చేసుకున్నారు.

ఈ సంధర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతి రాజధాని నిర్ణయానికి సహకరించిన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి అలాగే కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అమరావతిని రాజధానిగా నిలబెట్టేందుకు అహర్నిశలు కృషి చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు దృఢ సంకల్పమే ఈ విజయానికి కారణమని ఈ బిల్లు తీసుకురావడంలో కీలక పాత్ర వహించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో ఇది ఒక చారిత్రాత్మక అధ్యాయమని ఇకపై ఎవరూ రాష్ట్ర రాజధాని అమరావతిని కదిలించలేరన్నారు. ఇకనుంచి ఆంధ్ర రాజధాని అమరావతి అని ప్రజలు గుర్తిస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పంపు కొండప్ప క్లస్టర్ ఇంచార్జిలు సిసి రాము సోమర నారాయణ స్వామి మాజీ సర్పంచులు గాండ్లపర్తి నరేష్ సాకే తిరుపాల్ మాజీ కన్వీనర్ యర్రగుంట నారాయణస్వామి గంగలకుంట రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భవన్లో టీడీపీ శ్రేణుల సంబరాలు

## బాణా సంచా కాల్చి, మిఠాయిలు పంచుతూ హర్షాధికాలు



విజయవాడ, ఏప్రిల్ 2: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందటంతో విజయవాడ పార్లమెంటు కార్యాలయం ఎన్టీఆర్ భవన్లో టీడీపీ శ్రేణుల సంబరాలు మిన్నంటాయి. గురువారం సాయంత్రం ఎన్టీఆర్ భవన్ వద్ద బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ టీడీపీ శ్రేణులు సంతోష సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి నివాళులర్పించి జయహో అమరావతి అంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్ మాట్లాడుతూ.. పార్లమెంటులో అమరావతికి చట్టబద్ధత ఒక చారిత్రాత్మక ఘట్టం అన్నారు. అమరావతి రాజధానిగా ప్రపంచ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాల వల్ల అమరావతి ప్రపంచ స్థాయి రాజధానులలో నంబర్ వన్ రాజధానిగా అమరావతి మారుతోందని చెప్పారు. రైతుల పోరాటం మరియు కష్టాలు-అమరావతి నిర్మాణంలో దాగి ఉన్నాయన్నారు.

గత ప్రభుత్వ పాలనలో రైతులు దాదాపు 1600 రోజులకు పైగా సుదీర్ఘ పాదయాత్ర (అమరావతి నుండి తిరుపతి) చేసి అమరావతిని కాపాడుకున్నారన్నారు. రైతన్నలు లాఠీ దెబ్బలు, జైలు శిక్షలు సైతం లెక్క చేయక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. 2024 లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతికి పూర్వ వైభవం వచ్చిందనీ, అమరావతి రాజధాని నిర్మాణం చరవేగంగా జరుగుతుందన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అమరావతికి చట్టబద్ధత కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నడుం బిగించారని అన్నారు.

ప్రస్తుతం అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపిందన్నారు. అమరావతికి పార్లమెంట్లో చట్టబద్ధత కల్పించడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, రైతులు సంబరాలు చేసుకుంటున్నారన్నారు. అమరావతి ప్రాంతంలోని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పార్లమెంట్లో ఈ బిల్లు ఆమోదంకి పూర్తి మద్దతు కోసం విశేష కృషి చేశారన్నారు. ఎంపీ కేశినేని చిన్నితో అమరావతి బిల్లుకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుగు ప్రజల పక్షాన తెలుపుతున్నట్లు భవకుమార్ తెలిపారు.

తెలుగు ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తుంటే నేటికీ వైసీపీ అమరావతిపై విషం కక్కుతూనే ఉందన్నారు. నగరపాలక సంస్థ టిడిపి మాజీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి మాట్లాడుతూ అమరావతి చట్టబద్ధతకు కృషిచేసిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నేత నారా లోకేష్, బీజేపీ నేత అమిత్ షా తదితర నాయకులకు తెలుగు ప్రజలంతా ధన్యవాదాలు తెలుపుతున్నారు అన్నారు. టిడిపి రాష్ట్ర నాయకులు మాదిగాని గురునాథం మాట్లాడుతూ పార్లమెంటులో బిల్లు సమయంలో అమరావతి చరిత్ర ఎంపీల నోటి వెంట వింటుంటే తెలుగు జాతి ఘన చరిత్ర ఎంత ఘనమైందో ప్రపంచానికి మరోసారి తెలిసిందన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతి ఇకపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉడా మాజీ చైర్మన్ తూమాటి ప్రేమ్ నాథ్, మాజీ కార్పొరేటర్ లు దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి, జాస్తి సాంబశివరావు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కొట్టేటి హనుమంతరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి యాదవ్, మార్కెట్ యార్డు కమిటీ ఉపాధ్యక్షులు పాల మాధవ, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫైజాన్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు ఇర్ఫాన్, టీడీపీ జిల్లా కార్యదర్శి పిళ్ళ శ్రీనివాసరావు, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పరిసపోగు రాజేష్, లీగల్ సెల్ నాయకులు ఎర్నేని వేదవ్యాస్, శాప్ డైరెక్టర్ సంతోష్, గవర్నమెంట్ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, ఎన్ఐఆర్ డి అర్బన్ కోఆర్డినేటర్ నరసింహ చౌదరి, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి ఆనంద్ స్వరూపు, టి ఎన్ టి యు సి జిల్లా కార్యదర్శి కోడూరు ఆంజనేయ వాసు, పార్టీ సీనియర్ నాయకులు కొల్లి శ్రీనుబాబు, కోనేరు కిషోర్ బాబు, పెద్ద సంఖ్యలో మహిళ కార్యకర్తలు, నాయకులు, విజయవాడ అర్బన్ లోని వివిధ డివిజన్ల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.

# అంతరిక్ష అంకుర సంస్థల కోసం సిద్ధమైన భారత తొలి ప్రత్యేక వెంచర్ క్యాపిటల్ ఫండ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:అంతరిక్ష రంగం కోసం కేటాయించిన భారత ప్రత్యేక వెంచర్ క్యాపిటల్ ఫండ్ స్థిరంగా పురోగమిస్తోందని, ఎంపిక చేసిన స్టార్టప్‌లలో 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం నుంచి పెట్టుబడులు ప్రారంభమవుతాయని భావిస్తున్నట్లు కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూ విజ్ఞాన శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), ప్రధానమంత్రి కార్యాలయం, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణు ఇంధనం, అంతరిక్ష విభాగాల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

లోక్‌సభలో ఈ రోజు ఒక ప్రశ్నకు డాక్టర్ జితేంద్ర సింగ్ లిఖితపూర్వక సమాధానం ఇస్తూ, అభివృద్ధి చెందుతున్న భారత స్పేస్‌టెక్ వ్యవస్థను ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసిన "అంతరిక్ష వెంచర్ క్యాపిటల్ ఫండ్" కీలకమైన సంస్థాగత యంత్రాంగాలతో ఇప్పుడు అందుబాటులోకి వచ్చిందని తెలిపారు.

అంతరిక్ష రంగం కోసం కేటాయించిన వెంచర్ క్యాపిటల్ ఫండ్ స్థితిగతులు, పెట్టుబడులు, లబ్ధిదారులు, రాబడి, ఉపాధి కల్పన గురించి శ్రీ బస్తిపాటి నాగరాజు ఈ ప్రశ్న అడిగారు.

సిడ్బీ వెంచర్ క్యాపిటల్ లిమిటెడ్ (ఎస్వీసీఎల్)ను ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్‌గా నియమిస్తూ ఈ నిధిని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. ఈ ఫండ్ అక్టోబర్ 31, 2025న సెబీ వద్ద నమోదై, నవంబర్ 10, 2025 నాటికి రూ.1,005 కోట్ల మూలధనంతో ప్రాథమిక ప్రక్రియను పూర్తి చేసుకుందని వివరించారు.

రిజిస్ట్రేషన్ అనంతర పురోగతిని వివరిస్తూ, కస్టోడియన్ నియామకం, ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధి (ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ - ఏఎల్ఎఫ్) యూనిట్ల జారీ కోసం డిపాజిటరీలతో రిజిస్ట్రేషన్, స్క్రీనింగ్, ఇన్వెస్ట్‌మెంట్ కమిటీల ఏర్పాటు వంటి అవసరమైన లాంఛనాలు పూర్తయ్యాయని మంత్రి పేర్కొన్నారు.

ప్రస్తుతం స్పేస్‌టెక్ స్టార్టప్‌ల మూల్యాంకనం జరుగుతోందని, ముందస్తు పెట్టుబడి కమిటీ ఆమోదం పొందిన తర్వాత ఇప్పటికే నాలుగు ప్రతిపాదనలు పురోగతిలో ఉన్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. భారత స్పేస్‌టెక్ స్టార్టప్ వ్యవస్థ ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నందున చాలా స్టార్టప్‌లు సంస్థాగత పెట్టుబడి ప్రక్రియలకు అనుగుణంగా మారడానికి వ్యవస్థీకృత మార్గదర్శకత్వం అవసరమని ఆయన స్పష్టం చేశారు.

స్టార్టప్‌లు తమ డేటాను క్రమబద్ధీకరించుకోవడానికి, డాక్యుమెంటేషన్‌ను మెరుగుపరుచుకోవడానికి, కచ్చితత్వ పరిశీలన (డ్యూ డెలిజెన్స్) అవసరాలను తీర్చడానికి వారికి చేయూతను అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. స్టార్టప్‌లు సమర్థవంతంగా నిధులను పొందేలా, వారి ఆవిష్కరణలను విస్తరింపజేసేలా చేయడమే ఈ సులభతర విధానం ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

సమగ్ర మదింపు, థర్డ్-పార్టీ డ్యూ డెలిజెన్స్, డాక్యుమెంటేషన్ పూర్తి చేసిన తర్వాత మొదటి విడత నిధుల ఆమోదం, విడుదల 2027 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి మొదలు కావచ్చని డాక్టర్ జితేంద్ర సింగ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రపంచవ్యాప్తంగా పోటీ పడగలిగే అంతరిక్ష వ్యవస్థను పెంపొందించడంలో ప్రభుత్వ నిబద్ధతను డాక్టర్ జితేంద్ర సింగ్ పునరుద్ఘాటించారు. ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టడానికి ఇది ముఖ్యమైన కార్యక్రమమని ఆయన అన్నారు.

# ఎంవీ కృష్ణారావుకు కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు నివాళి..

అమరావతి, ఏప్రిల్ 2:ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి కేంద్ర రక్షణ శాఖ మాజీ సహాయ మంత్రి ఎంఎం పల్లంరాజు నివాళులు అర్పించారు. గురువారం ఒక ప్రైవేట్ కార్యక్రమానికి అవనిగడ్డ వచ్చిన ఆయన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఎంవీ కృష్ణారావు శత జయంతి పురస్కరించుకొని అవనిగడ్డ వంతెన సెంటరులో కృష్ణారావు విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండలి వెంకట్రామ్ పాల్గొన్నారు.

# విద్యార్థులు సెల్ ఫోన్‌కు దూరంగా ఉండాలి

నల్గొండ, ఏప్రిల్ 2:పోటీ ప్రపంచంలో విద్యార్థినీ, విద్యార్థులు సెల్ ఫోన్ కు దూరంగా ఉండి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని వికాస్ పాఠశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని వికాస్ పాఠశాలలో ప్రపంచ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా మొబైల్ ఫోన్ వద్దు ? పుస్తకాలు ముద్దు అనే అంశంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు పుస్తకాలు చదవడం వల్ల కలిగే ప్రయోజనాలను అలాగే సెల్ ఫోన్ ఉపయోగించడం వల్ల కలిగే నష్టాలను గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలిపారు.

వెయ్యికి పైగా పుస్తకాలను విద్యార్థుల ముందు ఉంచి పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్ఫోన్ వదిలి పుస్తకాలు పట్టడం వల్ల ఉజ్వలమైన అయిన భవిష్యత్తుతో పాటు సోషల్ మీడియాలో వచ్చే చెడు ప్రభావాలవైపు వెళ్లకుండా ఉంటారని, దానివల్ల జ్ఞానం పెరిగే అవకాశం ఉందన్నారు.

సెల్ ఫోన్ వాడటం వల్ల కంటి చూపు మందగించడం, మెదడు యొక్క ఆలోచన శక్తి తగ్గిపోవడం జరుగుతుందన్నారు. పుస్తకాలు చదవడం వల్ల నాలెడ్జిని పెంచుకొని రాబోయే పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవచ్చని తెలిపారు. పాఠశాలలో ప్రత్యేకమైన లైబ్రరీని ఏర్పాటు చేసి విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కెవి రెడ్డి, శ్రీలత, ప్రిన్సిపాల్ వేణుమాధవ్, నాగరాజు, వైస్ ప్రిన్సిపల్ రాజు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు

వరంగల్, ఏప్రిల్ 2:ఎండల తీవ్రత నుంచి బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఎంతో దోహదపడుతుందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండు సదానందం అన్నారు. గురువారం 31వ డివిజన్ న్యూశాయంపేట జంక్షన్లో ప్రజా సేవా సమితి వ్యవస్థాపకులు వేల్పుల వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు.

ఈసందర్భంగా సదానందం మాట్లాడుతూ బెస్ట్ సిటిజన్ అవార్డు గ్రహీత వేణుగోపాల్ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం స్ఫూర్తిదాయకమన్నారు. యువతను ఏకతాటిపై నడిపించడంలో ప్రజా సేవ సమితి ఫౌండేషన్ ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జానకీరాములు, శ్రీనివాస్, సందీప్, పాతిమాచారి, అమర్, సురేందర్ పాల్గొన్నారు.

# ప్రాంతీయ వ్యవసాయ సమావేశాలు ఏప్రిల్ 7న జైపూర్ నుంచి మొదలు: కేంద్ర వ్యవసాయ మంత్రి శ్రీ చౌహాన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:రైతుల ఐడీలూ, ఎరువుల లభ్యత, వివిధ వ్యవసాయ పథకాల పురోగతి సంబంధిత అంశాలను సమీక్షించడానికి రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ ఈ రోజు దృశ్య మాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు.

సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ రైతులను వారి భూమితో, పంటలతో, పశుగణంతో, మత్స్యపాలన ప్రక్రియతో అనుసంధానించడానికి రైతు ఐడీ ఒక ముఖ్య సాధనమన్నారు. ఇంతవరకు 19 రాష్ట్రాల్లో మొత్తంమీద 9.25 కోట్ల రైతు ఐడీల్ని రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ, రెవెన్యూ విభాగాలు కలిసి ఒక ప్రచార ఉద్యమాన్ని మొదలుపెట్టి, రాబోయే ఆరు నెలల లోపల 100 శాతం లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నాలు చేయాలని ఆయన ఆదేశించారు. అదే సమయంలో, రైతు నమోదు ప్రక్రియను ఒక్క పీఎం-కిసాన్ లబ్ధిదారులకు మాత్రమే పరిమితం చేయకుండా, అర్హులైన రైతులందరినీ ఇందులో చేర్చేలా చూడడానికి ప్రజాచైతన్య ప్రచార కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని కూడా ఆయన అన్నారు.

ఎరువుల లభ్యత అంశాన్ని కేంద్ర మంత్రి ప్రస్తావిస్తూ, రైతులకు ఎరువుల అందుబాటులో ఎలాంటి లోటునూ రానీయకూడదన్నారు. ఎరువులను అక్రమంగా నిల్వ చేయడం, నల్లబజారులో విక్రయించడం వంటి ధోరణులను కఠినంగా అరికట్టాలని రాష్ట్రాలకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. రైతుల అవసరాలకు తగినట్లుగా ఎరువులను అందించేలా చర్యలు తీసుకోవాలనీ, దీని కోసం సాంకేతికత ఆధారిత సమాన పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఎరువుల అసమతౌల్య ఉపయోగాన్ని నివారించడానికి, సేంద్రియ సాగుని, ప్రాకృతిక వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి చైతన్యాన్ని పెంచడం ముఖ్యమని కూడా ఆయన అన్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘాను కొనసాగించాల్సిందిగా ఆయన ఆదేశాలిస్తూ, ఎరువులను చట్టవిరుద్ధంగా తరలించడాన్ని అడ్డుకోవాలని స్పష్టం చేశారు. హర్యానాలో అమలు చేస్తున్న 'మేరీ ఫసల్, మేరా బ్యోరా' కార్యక్రమాన్ని శ్రీ చౌహాన్ ప్రశంసించారు. ఈ నమూనాను ఇతర రాష్ట్రాలు అమలు చేయవచ్చని మంత్రి తెలిపారు.

పీఎం?ఆశా పథకంలో భాగంగా పప్పుధాన్యాలనూ, నూనెగింజలనూ కనీస మద్దతు ధరకు (ఎమ్ఎస్‌పీ) కొనుగోలు చేసే అంశంపైనా సమీక్షను నిర్వహించారు. ఈ పథకంలో భాగంగా ప్రభుత్వం పప్పుధాన్యాలనూ, నూనెగింజలనూ ఎమ్ఎస్‌పీపై కొనుగోలు చేస్తుందనీ, ఈ పథకం మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రాలు పాలుపంచుకుంటాయనీ శ్రీ శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.

కొనుగోళ్లను న్యాయమైన సగటు నాణ్యత (ఫెయిర్ ఏవరేజ్ క్వాలిటీ..ఎఫ్ఏక్యూ)కు సంబంధించిన ఫలసాయానికి మాత్రమే పరిమితం చేయాల్సిందిగా కేంద్ర మంత్రి ఆదేశించారు. రైతుల నమోదు ప్రక్రియను ఆధార్‌తో ముడిపెట్టిన పోర్టళ్లపైనే నిర్వహించాలని, కొనుగోలు కేంద్రాల్లో బయమెట్రిక్, లేదా ముఖం గుర్తింపు పద్ధతిని తప్పనిసరి చేయాలని సూచించారు. చెల్లింపులను 'ఆధార్' ఆధారిత డీబీటీ (ప్రత్యక్ష ప్రయోజన బదిలీ) మాధ్యమం ద్వారా రైతుల ఖాతాల్లోకి నేరుగా చేయాలని, రైతు సోదరీ, సోదరులకు ఎలాంటి ఇబ్బందులూ ఎదుర్కోవాల్సిన పని ఉండకుండా కొనుగోలు కేంద్రాల్ని తగినంత సంఖ్యలో ఏర్పాటు చేయాలని తెలిపారు.

అలాగే, రైతులు వారు పండించిన పంటలకు న్యాయమైన ధరను అందుకొనేటట్లు రాష్ట్రాలు చూడాలనీ, వారి ఫిర్యాదుల్ని సకాలంలో పరిష్కరించాలని, నేరుగా రైతుల నుంచే కొనుగోళ్లను పూర్తి చేయాలని ఆయన కోరారు.

ప్రాంతీయ వ్యవసాయ సమావేశాలపై ఈ దిగువ సమాచారం అందజేత

దీనికి అదనంగా, ప్రాంతీయ వ్యవసాయ సమావేశాల నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని మంత్రి పంచుకున్నారు. దేశాన్ని అయిదు వ్యవసాయ-క్లైమేటిక్ జోన్లుగా విభజించి, ప్రతి ఒక్క జోన్లోనూ సమగ్ర చర్చలు జరపాలని ఆయన అన్నారు. దీనిలో భాగంగా, పశ్చిమ జోనును దృష్టిలో పెట్టుకొని, తొలి సమావేశాన్ని జైపూర్‌లో ఏప్రిల్ 7న నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ (వీకేఎస్ఏ)ను గురించి కేంద్ర మంత్రి ప్రస్తావిస్తూ, కిందటి సంవత్సరం నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు. దానిలో 726 జిల్లాలకు చెందిన 60,000కి పైగా గ్రామాలలో శాస్త్రవేత్తలు రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారని మంత్రి తెలిపారు. ఈ సాఫల్యాన్ని దృష్టిలో పెట్టుకుని, రాష్ట్రాలు ఈ సంవత్సరం మే నెలలో ఈ ప్రచార కార్యక్రమాన్ని 15-20 రోజుల పాటు నిర్వహించాలని ఆయన కోరారు. ప్రయోగశాల నుంచే పొలాన్ని అనుసంధించడాన్ని పటిష్ఠపరచడం, కొత్త సాంకేతికతలను, మెరుగైన రకాలను, ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం లక్ష్యాలని ఆయన వివరించారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి చేరాలి-ఎమ్మెల్యే జారె



నల్గొండ, ఏప్రిల్ 2:రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి చేరాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు . ప్రజాపాలన , ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామ సభల నేపథ్యంలో దమ్మపేట మండలంలోని పలు గ్రామపంచాయతీలలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దమ్మపేటలో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడం గ్రామ సభల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ఇటీవల ఎన్నికైన గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామాల్లో ప్రజల సమస్యలను గుర్తించి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో పారదర్శకంగా బాధ్యతగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు .దమ్మపేట మండల కేంద్రం అన్ని రంగాల్లో ముందుండాలనే లక్ష్యంతో దమ్మపేటకు కమ్యూనిటీ హాలు , బస్టాండ్ అభివృద్ధి ,చెరువు అభివృద్ధి తదితర కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.

దమ్మపేట మండల కేంద్రాన్ని సుందరంగా తీర్చి దిద్దాల్సిన భాద్యత అధికారులు, ప్రజాప్రతినిధులపైన ఉందన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయటం జరుగుతుందన్నారు. దమ్మపేట సర్పంచ్ వగడాల రమాదేవి మాట్లాడుతూ గ్రామంలో వున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం ప్రజల అభిప్రాయాలను సేకరించి, తదనుగుణంగా అభివృద్ధి చేయటం జరుగుతుందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. దమ్మపేటను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. దమ్మపేట బస్టాండ్ లో పెట్రోల్ బంక్ నిర్మాణానికి అనుమతి ఇవ్వకూడదని తీర్మానించటం జరిగింది . దమ్మపేటలో సీసీ కెమెరాలు, డ్రైనేజీ, పంచాయితీ స్థలంలో కాంప్లెక్స్ నిర్మాణం, లైబ్రరీ, శ్మశానవాటికకు ప్రహరీ గోడ, అర్హులైనవారికి ఇందిరమ్మ ఇళ్ళు, అంగన్వాడీలకు భవనాలు తదితర అంశాలు తీర్మానించటం జరిగింది పెట్రోల్ బంక్ వద్దు - బస్టాండ్ ముద్దు..

ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా దమ్మపేటలో గురువారం జరిగిన గ్రామసభలో ప్రధానంగా బస్టాండ్ లో పెట్రోల్ బంక్ నిర్మాణంపై సుధీర్ఘ చర్చ జరిగింది. ఈ చర్చలో గ్రామస్తులందరూ ముక్త కంఠంతో బస్టాండ్ లో పెట్రోల్ బంక్ నిర్మాణం నిలిపివేయాలని , బస్టాండ్ ను పునరుద్ధరించి, ప్రతి బస్సు దమ్మపేట బస్టాండ్ కు వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి, ట్రాన్స్కో ఏఈ సాయి కిరణ్, వెటర్నరీ డాక్టర్ తేజా రాణి, ఏఈవో దీప్తి, పిహెచ్సి వైద్యులు మణిదీప్, పంచాయితీ కార్యదర్శి బండి అనంత్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు .

# ఒడిశాలోని లఖన్‌పూర్‌లో బొగ్గు నుంచి అమ్మోనియం నైట్రేట్ ప్రాజెక్టు కోసం బీసీజీసీఎల్, ఎంసీఎల్ మధ్య కీలక భూ లీజు ఒప్పందం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:ఒడిశాలోని లఖన్‌పూర్‌లో ఏర్పాటు కానున్న బొగ్గు నుంచి అమ్మోనియం నైట్రేట్ ను ఉత్పత్తి చేసే ప్రాజెక్టు కోసం భారత్ కోల్ గ్యాసిఫికేషన్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (భారత బొగ్గు వాయువీకరణ, రసాయనాల సంస్థ-బీసీజీసీఎల్), మహానది కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎంసీఎల్) మధ్య కీలక భూ లీజు ఒప్పందం కుదిరింది. న్యూఢిల్లీలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జీ కిషన్ రెడ్డి సమక్షంలో ఈ ఒప్పంద కార్యక్రమం జరిగింది. ఈ ఒప్పందాన్ని దేశ బొగ్గు గ్యాసిఫికేషన్ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లే దిశగా కీలక పరిణామంగా భావిస్తున్నారు.

ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతిరోజూ 2,000 టన్నుల అమ్మోనియం నైట్రేట్‌ను బొగ్గు నుంచి ఉత్పత్తి చేయనున్నారు. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన గ్యాసిఫికేషన్ సాంకేతికతను ఉపయోగించనున్న దేశంలోనే మొదటి ప్రాజెక్టు కావడం విశేషం. ఈ ప్రాజెక్టు ఇంధన, రసాయన రంగాల్లో విదేశీ సాంకేతికతపై ఆధారపడటాన్ని తగ్గించడమే కాకుండా, స్వదేశీ ఆవిష్కరణలు, సాంకేతిక పురోగతికి నిదర్శనంగా నిలవనుంది.

మహానది కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ పరిధిలోని సుమారు 350 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఇటీవల తీసుకువచ్చిన విప్లవాత్మక విధాన సంస్కరణల వల్ల బొగ్గు నిక్షేపాలున్న భూములను గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల కోసం వినియోగించే అవకాశం కలిగింది. ఇది దేశంలోని అపారమైన బొగ్గు వనరులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడానికి, బొగ్గు రంగం విస్తరణకు దోహదపడుతుంది.

బొగ్గు గ్యాసిఫికేషన్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక ప్రోత్సాహక పథకం కింద ఈ ప్రాజెక్టుకు రూ.1,350 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ప్రాజెక్టు పనులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో వేగం పుంజుకున్నాయి. ప్రధాన ఎల్ఎస్‌టీకే ప్యాకేజీలలో ఎల్ఎస్‌టీకే-1, ఎల్ఎస్‌టీకే-2లను బీహెచ్ఈఎల్ దక్కించుకోగా.. ఎల్ఎస్‌టీకే-3, ఎల్ఎస్‌టీకే-4 ప్యాకేజీలను లార్సెన్ టూబ్రో సంస్థ దక్కించుకున్నది. సరిహద్దు గోడల నిర్మాణం, చెట్ల లెక్కింపు వంటి ప్రాంత అభివృద్ధి పనులు సమాంతరంగా జరుగుతున్నాయి. నిర్దేశిత గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేయడమే లక్ష్యంగా పనులు సాగుతున్నాయి.

భూ లీజు ఒప్పంద కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జీ కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు అనుగుణంగా బొగ్గు రంగంలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని తెలిపారు. బొగ్గు రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. దేశంలో అపారమైన బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని.. అయితే ఆ వనరులను కేవలం సంప్రదాయ పద్ధతుల్లో కాకుండా, భారీ స్థాయిలో బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రోత్సాహానికి కేంద్ర కేబినెట్ రూ. 8,500 కోట్లు కేటాయించిందని మంత్రి వెల్లడించారు.

ఇప్పటికే 7 ప్రాజెక్టులను ఖరారు చేయగా, అందులో మూడింటికి భూమి పూజ కూడా పూర్తయిందని తెలిపారు. సుమారు రూ.25, 000 కోట్ల పెట్టుబడితో ఎంసీ ఎల్, బీసీజీసీఎల్ మధ్య కుదిరిన ఈ భూ లీజు ఒప్పందం.. బీసీజీసీఎల్ మొదటి స్వదేశీ ప్రాజెక్టుగా నిలుస్తుందని తెలిపారు.

# ఏకైక రాజధానిగా అమరావతిని ఏర్పాటు చేసే చారిత్రక సవరణ: స్థిరత్వం, వృద్ధి దిశగా నిర్ణయాత్మక అడుగు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:లోక్ సభలో ఈ రోజు ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు-2026 ఆమోదం పొందడాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రయాణంలో కీలకమైన ఘట్టంగా కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వర్ణించారు.

ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించడం ద్వారా ఈ బిల్లు.. పరిపాలన, పెట్టుబడులు, వృద్ధిపై దీర్ఘ కాలంగా ప్రభావాన్ని చూపిస్తున్న నిర్మాణాత్మక అనిశ్చితిని తొలగిస్తుంది.

గత కొన్నేళ్లుగా స్పష్టంగా నిర్ణయించిన రాజధాని లేకపోవడం వల్ల పరిపాలనపరమైన సందిగ్ధతకు, మౌలిక వసతుల ఏర్పాటులో జాప్యానికి, పెట్టుబడదారుల విశ్వాసం క్షీణతకు దారితీసిందని ఆయన అన్నారు. స్పష్టమైన, స్థిరమైన, భవిష్యత్తు దృష్టితో కూడిన నిబంధనలను ఈ సవరణ అందిస్తుంది. అలాగే రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ స్ఫూర్తికి అనుగుణంగా ఏకైక, అంతర్జాతీయ స్థాయి రాజధాని అనే లక్ష్యాన్ని బలోపేతం చేస్తుంది.

అమరావతి ఉద్యమాన్ని ముందుండి నడిపించిన రైతులు, మహిళల అసాధారణ త్యాగాలను కేంద్ర మంత్రి వివరించారు. 29,000కు పైగా రైతులు 34,000 ఎకరాలకు పైగా తమ పూర్వీకుల భూములను స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అందించారు. విధాన నిర్ణయాల్లో మార్పుల కారణంగా దీర్ఘకాలంగా నెలకొన్న అనిశ్చితిని భరించారు.

శాంతియుత నిరసనలు తెలిపిన మహిళలు, స్థానిక సంఘాలు తీవ్రమైన కష్టాలను, ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ, దృఢసంకల్పంతో, క్రమశిక్షణతో, అహింసాయుత పద్ధతిలో తమ ఉద్యమాన్ని 1,600 రోజులకు పైగా కొనసాగించి ప్రజాస్వామ్య స్ఫూర్తికి శక్తిమంతమైన చిహ్నంగా నిలిచారు.

ఇది న్యాయపరమైన సవరణ మాత్రమే కాదని, రాష్ట్ర భవిష్యత్తు కోసం అసమాన త్యాగాలను చేసిన వారి గౌరవాన్ని, న్యాయాన్ని, నమ్మకాన్ని పునరుద్ధరించే నైతికపరమైన చర్య అని మంత్రి స్పష్టం చేశారు.

అంతర్జాతీయ స్థాయి నగరంగా, ఆంధ్రప్రదేశ్ వృద్ధిని నడిపించే శక్తిగా రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దే పరివర్తనాత్మక లక్ష్యాన్ని డాక్టర్ పెమ్మసాని పునరుద్ఘాటించారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థల మద్దతుతో రూ.56,000 కోట్ల విలువైన 91 ప్రధాన మౌలిక వసతులకు సంబంధించిన ప్రాజెక్టు పనులు కొనసాగుతున్న నేపథ్యంలో అమరావతికి అధికారిక గుర్తింపు లభించడం పెట్టుబడులను వేగవంతం చేస్తుందని, విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని, రాష్ట్ర ఆర్థిక వృద్ధిని గణనీయంగా విస్తరిస్తుందని ఆశిస్తున్నట్టు కేంద్ర మంత్రి తెలిపారు.

రాష్ట్ర రాజధాని భవిష్యత్తులో రైతులే ప్రధాన శక్తిగా మారిన భాగస్వామ్య విధానానికి, సమగ్రాభివృద్ధికి మార్గదర్శక ఉదాహరణగా స్వచ్ఛంద భూసమీకరణపై నిర్మితమైన అమరావతి విధానం నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ఆవిష్కరణాత్మక విధానం.. అనుసరించదగిన సమవృద్ధి విధానంగా దేశం దృష్టిని ఆకర్షించదన్నారు. ఆర్థిక ప్రదర్శనను మెరుగు పరచడంలో రాజధాని నగరాలు పోషించే కీలక పాత్రను కూడా కేంద్ర మంత్రి వివరించారు. ఆయా రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థల వృద్ధిలో ప్రధాన నగరాలు తమ వంతు తోడ్పాటును అందిస్తాయని తెలిపారు. అమరావతి రాజధానిగా పరిపాలన, వాణిజ్యం, ఆవిష్కరణల్లో ఆంధ్రప్రదేశ్ శక్తిమంతమైన కేంద్రంగా ఆవిర్భవించడానికి సిద్ధంగా ఉంది. జాతీయ, రాష్ట్ర నాయకత్వాల పాత్ర గురించి వివరిస్తూ.. ఈ చరిత్రాత్మక చట్టం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్ణయాత్మక నాయకత్వాన్ని, ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు దూరదృష్టితో కూడిన ప్రణాళికను, కేంద్ర హోం మంత్రి అమిత్ షా అందించిన కీలకమైన మద్దతును ప్రతిబింబిస్తుందన్నారు.

ఈ బిల్లు కేవలం ఒక విధాన నిర్ణయం మాత్రమే కాదు. ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి గమనాన్ని పునర్నిర్వచించే ఒక నిర్ణయాత్మక దిద్దుబాటు చర్య. పరిపాలనా స్థిరత్వాన్ని కల్పించడం, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పునరుద్ధరించడం, ప్రజల త్యాగాలను గౌరవించడం ద్వారా ఈ సవరణ అమరావతిని ఆకాంక్ష, దృఢత్వం, సమ్మిళిత వృద్ధికి శాశ్వత ప్రతీకగా నిలుపుతుంది.

# గృహాల జాబితా, గృహ జన గణన (హెచ్ఎల్వో)తో మొదలైన ప్రపంచంలో అతిపెద్ద జనగణన ప్రక్రియ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:ప్రపంచంలో అతిపెద్ద జనగణన ప్రక్రియ అయిన 2027 జనాభా లెక్కలు మొదలయ్యాయి. ఈ జనగణనలో మొదటి దశ అయిన గృహాల జాబితా, గృహ గణన (హెచ్ఎల్వో)ను భారత ప్రభుత్వం నేటి నుంచి ప్రారంభించింది. దీంతో దేశంలో అతిపెద్ద పరిపాలన, గణాంక ప్రక్రియ ప్రారంభమైంది. దేశంలో మొదటిసారి డిజిటల్ పద్ధతిలో డేటా సేకరణ, స్వీయ నమోదు ప్రక్రియ ఇది.

భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము.. స్వీయగణన అవకాశాన్ని వినియోగించుకుంటూ వివరాలను నమోదు చేయడంతో దేశంలో జనగణన ప్రక్రియ ప్రారంభమైంది. దేశ ప్రథమ పౌరులతో దేశంలో జనాభా లెక్కల ప్రక్రియను ప్రారంభించే సంప్రదాయాన్ని సగర్వంగా కొనసాగిస్తూ.. ఈ జనగణనకు శ్రీకారం చుట్టారు.

2027 జనాభా లెక్కల కోసం ఉపరాష్ట్రపతి భవన్ శ్రీ సి.పి. రాధాకృష్ణన్.. ఉపరాష్ట్రపతి భవన్‌లో ఆన్లైన్‌లో స్వీయ గణన పత్రాన్ని పూరించారు.

ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ తన స్వీయ గణన ప్రక్రియను పూర్తి చేశారు. ప్రజలంతా తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకుంటూ ఈ జనగణన ప్రక్రియలో భాగస్వాములు కావాలని దేశ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా కూడా స్వీయ గణన వెబ్‌సైట్ ద్వారా వివరాలను నమోదు చేశారు. ఈ జాతీయ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ప్రధానమైన అంశమని స్పష్టం చేశారు.

తొలి దశలో భాగంగా ఎనిమిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ రోజు నుంచి స్వీయ గణన ప్రక్రియ ప్రారంభమైంది. అండమాన్ నికోబార్ దీవులు, గోవా, కర్ణాటక, లక్షద్వీప్, మిజోరాం, ఒడిషా, సిక్కింతోపాటు దేశ రాజధానిలోని న్యూఢిల్లీ మునిసిపల్ కౌన్సిల్ (ఎన్ఎండీసీ) ప్రాంతం, ఢిల్లీ కంటోన్మెంటు బోర్డులు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన దాదాపు 55,000 కుటుంబాలు తొలిరోజే ఈ స్వీయ నమోదు సౌకర్యాన్ని వినియోగించుకున్నాయి. ఈ రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో గృహాల జాబితా, గృహగణన 2026 ఏప్రిల్ 16న ప్రారంభమై, 2026 మే 15 వరకు కొనసాగుతుంది.

స్వీయ గణ నమోదు ప్రక్రియ 16 ప్రాంతీయ భాషలలో అందుబాటులో ఉన్న ఒక సురక్షితమైన, వెబ్ ఆధారిత సదుపాయం. దీనిద్వారా గణకులు క్షేత్ర స్థాయిలో సందర్శించడానికి ముందే.. పౌరులు తమకు అనుకూలమైన సమయంలో ఆన్‌లైన్‌లో వివరాలను అందించవచ్చు. ఈ అవకాశాన్ని తొలిసారిగా అందిస్తున్నారు. గతంలో చేపట్టిన జనాభా లెక్కల మాదిరిగానే ఈ సారి కూడా గణకులు తమకు కేటాయించిన గృహ జాబితా బ్లాకులన్నింటిలోనూ ప్రతి ఇంటినీ సందర్శిస్తారు. అయితే, స్వీయగణన అన్నది ఈసారి కల్పించిన అదనపు సౌకర్యం. బవ.ఇవనిబబీబ.ఐనీల.తిని వెబ్‌సైటులో లాగిన్ అయ్యి.. మొబైల్ నంబరు, ప్రాథమిక వివరాలను ఉపయోగించి స్వీయగణన ప్రక్రియను పూర్తిచేయొచ్చు. వివరాలను సమర్పించిన అనంతరం ఒక ప్రత్యేక స్వీయ గణన ఐడీ (ఎస్ఈఐడీ)ని పొందుతారు. ఆ తర్వాత క్షేత్రస్థాయి సందర్శన సమయంలో.. నిర్ధారణ కోసం గణన అధికారికి ఆ ఐడీని అందించాల్సి ఉంటుంది.

గృహాల జాబితా, గృహ గణన దశలో భాగంగా.. గృహాల స్థితిగతులు, వసతులు, ఆస్తుల వివరాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరిస్తారు. ఈ కీలక సూచికలను నమోదు చేయడం కోసం మొదటి దశకుగాను మొత్తం 33 ప్రశ్నలను 2026 జనవరిలో ప్రకటించారు. ఆధారాల ప్రాతిపదికన ప్రణాళికా రచన, విధాన రూపకల్పన, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేసేందుకు ఈ సమాచారమే పునాదిగా నిలుస్తుంది.

దేశవ్యాప్తంగా 2026 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు గృహాల జాబితా, గృహ గణన (హెచ్ఎల్వో) ప్రక్రియను నిర్వహిస్తారు. ఈ ఆరు నెలల వ్యవధిలో ప్రతి రాష్ట్రమూ, కేంద్రపాలిత ప్రాంతాల్లో... ఆయా ప్రభుత్వాలు ప్రకటించిన మేరకు 30 రోజుల పాటు నిరంతర క్షేత్రస్థాయి కార్యకలాపాలను చేపట్టాలి. ఇంటింటి సర్వేకు సరిగ్గా ముందు.. స్వీయ గణన కోసం అదనంగా 15 రోజుల గడువునివ్వడం ఇదే మొదటిసారి. గణన అధికారి సందర్శనకు ముందే ప్రజలు ఇళ్లలో నుంచే డిజిటల్‌గా తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశాన్ని ఈ సదుపాయం అందిస్తుంది.

వచ్చే దశాబ్ద కాలానికి సంబంధించి దేశ అభివృద్ధి ప్రణాళికలకు పునాది వేస్తూ.. పరిపాలనలో అత్యంత కీలక సాధనంగా ఈ జనగణన నిలుస్తుంది. జనగణన చట్టం – 1948 ప్రకారం సేకరించిన సమాచారాన్ని అత్యంత రహస్యంగా ఉంచుతారు. 2027 జనాభా లెక్కల కోసం ఉపయోగిస్తున్న డిజిటల్ పరికరాలు, సాంకేతికతను.. సమాచార భద్రతలో అత్యున్నత ప్రమాణాలను పాటించేలా బలమైన ఎన్‌క్రిప్షన్, మల్టీ ఫ్యాక్టర్ అ ధ:ెంటికేషన్లతో రూపొందించారు. స్వీయ గణన ద్వారాగానీ, లేదా క్షేత్రస్థాయి సందర్శన సమయంలో జనాభా లెక్కల అధికారులకు పూర్తిగా సహకరించి వివరాలు అందజేయడం ద్వారాగానీ జనాభా లెక్కల ప్రక్రియలో ప్రజలు భాగస్వాములు కావాల్సిందిగా ప్రభుత్వం విన్నవిస్తోంది.

# 3 నుంచి 8వ తరగతి వరకు కంప్యూటేషనల్ థింకింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై సీబీఎస్ఈ కొత్త పాఠ్యప్రణాళికను ప్రారంభించిన కేంద్ర విద్యామంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:కంప్యూటేషనల్ థింకింగ్ (సీటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పై 3 నుంచి 8వ తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన సీబీఎస్ఈ కొత్త పాఠ్యప్రణాళికను కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ఈ రోజు న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రారంభించారు. కేంద్ర నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల స్థాపన శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), విద్యాశాఖ సహాయ మంత్రి శ్రీ జయంత్ చౌదరితో పాటు పాఠశాల విద్య, సాక్షరత విభాగం కార్యదర్శి శ్రీ సంజయ్ కుమార్, ఉన్నత విద్యా విభాగం కార్యదర్శి డాక్టర్ వినీత్ జోషి, సీబీఎస్ఈ ఛైర్మన్ శ్రీ రాహుల్ సింగ్, ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ శ్రీ దినేష్ ప్రకాష్ సక్లానీ, విద్యా మంత్రిత్వ శాఖ, సీబీఎస్ఈ, కేంద్రీయ విద్యాలయ, నవోదయ విద్యాలయ, ఎన్‌సీఈఆర్‌టీకి చెందిన ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సభను ఉద్దేశించి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ, 3 నుంచి 8వ తరగతుల వరకు కంప్యూటేషనల్ థింకింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై కొత్త పాఠ్యప్రణాళికను ప్రారంభించడం విద్యా సంవత్సరం ఆరంభంలో భవిష్యత్తు అవసరాలకు తగిన అభ్యాసం వైపు ఒక విప్లవాత్మక అడుగు అని పేర్కొన్నారు. ఈ చొరవ పాఠశాల వ్యవస్థలో వ్యవస్థీకృత ఏఐ విద్యను భారీ స్థాయిలో అధికారికంగా ప్రవేశపెట్టిందని ఆయన తెలిపారు. ఈ పాఠ్యప్రణాళికకు అనుగుణంగా క్రమబద్ధమైన మాడ్యూల్స్, సమగ్రమైన ఉపాధ్యాయ కరదీపికలు, పటిష్టమైన విద్యార్థి మూల్యాంకన విధానాలు ఉన్నాయని, ఇవి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై విద్యార్థులకు చిన్న వయస్సు నుంచే సరైన అవగాహన కల్పిస్తూ, రేపటి తరం అభ్యాసకులకు బలమైన పునాది వేస్తాయని ఆయన వివరించారు.

'విద్య కోసం ఏఐ, విద్యలో ఏఐ' (ఏఐ ఫర్ ఎడ్యుకేషన్, ఏఐ ఇన్ ఎడ్యుకేషన్) దార్శనికతకు అనుగుణంగా, ఈ చొరవ యువతలో విమర్శనాత్మక ఆలోచన, డిజైన్ ఓరియంటేషన్, ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించడం ద్వారా మెరుగైన అభ్యాసం వైపు ఒక నిర్ణయాత్మక మార్పును సూచిస్తుందని మంత్రి తెలిపారు. సాంకేతికత ఆధారిత కంప్యూటింగ్‌లో భారత నాయకత్వానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు లభిస్తున్న తరుణంలో, ఈ పాఠ్యప్రణాళిక డిజిటల్ భవిష్యత్తును అర్థం చేసుకోవడానికి, దానిని తీర్చిదిద్దడానికి విద్యార్థులకు శక్తినిస్తుందని శ్రీ ప్రధాన్ స్పష్టం చేశారు.

దూరదృష్టితో కూడిన ఈ పాఠ్యప్రణాళికను రూపొందించినందుకు, సాంకేతికతతో కూడిన విద్యా వ్యవస్థను ముందుకు తీసుకెళ్తున్నందుకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ), నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్సీఈఆర్టీ)లను శ్రీ ప్రధాన్ అభినందించారు.

ఈ సందర్భంగా శ్రీ జయంత్ చౌదరి మాట్లాడుతూ, మారుతున్న ప్రపంచానికే కాకుండా, మనం ఊహించలేని విధంగా మారబోయే భవిష్యత్తు కోసం కూడా నేటి విద్య యువతను సిద్ధం చేయాలని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇప్పటికే విజ్ఞాన సముపార్జన, నిర్ణయాలు తీసుకోవడం, ఆర్థిక వ్యవస్థల పనితీరును మారుస్తోందని, అందువల్ల మన పిల్లలు సాంకేతికతను కేవలం వినియోగించేవారిగా కాకుండా, దానిని ఆలోచనాత్మకంగా సృష్టించేవారుగా, బాధ్యతాయుతమైన నాయకులుగా ఎదగడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. చిన్న వయస్సు నుంచే కంప్యూటేషనల్ థింకింగ్‌ను పరిచయం చేయడం ద్వారా నిరంతరం నేర్చుకుంటూ, అస్థిరతను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటూ, అడ్డంకులను అవకాశాలుగా మార్చుకోగల ఒక తరానికి మనం పునాది వేస్తున్నామని ఆయన తెలిపారు. ఇది కేవలం విద్యా సంస్కరణ మాత్రమే కాదు, మానవ సామర్థ్యంపై జాతీయ పెట్టుబడి అని ఆయన అన్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 దార్శనికతకు అనుగుణంగా, భారతీయ అభ్యాసకులను రేపటి ఉద్యోగాలకే కాకుండా, ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించే ఆలోచనలు, వ్యవస్థలు, పరిష్కారాలను రూపొందించేవారిగా సిద్ధం చేయడం దీని ఉద్దేశమని ఆయన వివరించారు.

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం పర్యవేక్షణలో, పాఠశాల విద్యార్థులలో ఏఐ పట్ల సంసిద్ధతను పెంపొందించడానికి కంప్యూటేషనల్ థింకింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాఠ్యప్రణాళికను సీబీఎస్ఈ అమలు చేస్తోంది. ఈ పాఠ్యప్రణాళికను 2026-27 విద్యా సంవత్సరం నుంచి 3 నుంచి 8వ తరగతి వరకు అమలు చేస్తారు. కంప్యూటేషనల్ థింకింగ్ నైపుణ్యాలపై దృష్టి సారించడం ద్వారా విద్యార్థులను ఏఐ సన్నద్ధ అభ్యాసకులుగా తీర్చిదిద్దడమే దీని లక్ష్యం. కంప్యూటేషనల్ థింకింగ్ నైపుణ్యాల ద్వారా పెంపొందే ఏఐ-సంసిద్ధత విద్యార్థులలో తార్కిక ఆలోచన, సమస్యల పరిష్కారం, ప్యాటర్న్ రికగ్నిషన్ వంటి సామర్థ్యాలను అభివృద్ధి చేయడమే కాకుండా వారు రోజువారీ జీవితంలో కృత్రిమ మేధ పాత్ర, వినియోగాన్ని అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది.

# హనుమాన్ టెంపుల్లో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే..



మంచిర్యాల ఏప్రిల్ 2: హనుమాన్ జయంతి సందర్భంగా మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని పైడిపల్లి హనుమాన్ దేవాలయంలో గురువారం మధ్యాహ్నం నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పొనకల్ వాసి, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు జక్కు సత్తయ్య గుప్తా, కుమారులు జక్కు రమేష్, భూమేష్, శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో పండితులు గుండి సత్యనారాయణ శర్మ, గణేష్ శర్మ లు అభిషేకం, అర్చన, హోమం కార్యక్రమాలు నిర్వహించి, అన్నదానం చేశారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి, తీర్థ,అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎర్ర చంద్రశేఖర్, గ్రామ సర్పంచి జక్కు సుష్మ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసాక్,పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముజఫర్, మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పలు హనుమాన్ దేవాలయాల్లో భక్తులు హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించుకున్నారు.

# జిల్లా కలెక్టర్ సంచలన నిర్ణయం..76 మంది విద్యాశాఖ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

గద్వాల, ఏప్రిల్ 2:: జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. విద్యాశాఖలో ఒకేసారి 76 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఫేస్ రికగ్నైజ్ సిస్టం హాజరు విధానం సక్రమంగా నిర్వహించకపోవడంతో 76 మంది విద్యాశాఖ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.

గురువారం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలలో అమలవుతున్న ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ హాజరు నమోదుపై సమగ్రంగా పరిశీలించగా పలుచోట్ల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఎఫ్.ఆర్.ఎస్ యాప్‌లో హాజరు సక్రమంగా నమోదు చేయకపోవడాన్ని గమనించినట్లు వివరించారు. సంబంధిత సిబ్బంది తమ సంజాయిషీని మూడు రోజుల లోపు సమర్పించాలని ఆదేశించారు.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రభుత్వం నిర్దేశించిన విధివిధానాలను కచ్చితంగా పాటించడంతో పాటు, ప్రతి రోజూ ఎఫ్.ఆర్.ఎస్ ద్వారా హాజరును తప్పనిసరిగా సమయానికి నమోదు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# దేవాలయ నిర్మాణం శుభ పరిణామం..



అమరావతి, ఏప్రిల్ 2:జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెల్లంపల్లి గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ శిలా శంకుస్థాపన మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి , జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి మాట్లాడుతూ, గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణం జరగడం ఎంతోశుభపరిణామమని తెలిపారు.

ఈ దేవాలయం భక్తులకు ఆధ్యాత్మిక చైతన్యం అందించే పవిత్ర స్థలంగా మారాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సౌహార్దం, ఐక్యత పెరగాలని కోరుతూ దేవాలయ నిర్మాణానికి తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజు గౌడ్ మండల ప్రధాన కార్యదర్శి బండారి సమ్మయ్య జిల్లా నాయకుడు కూర సురేందర్ రెడ్డి సుబ్బక్క పల్లె సర్పంచ్ బొడ్డు రాజేందర్ వెల్లంపల్లి బూత్ అధ్యక్షుడు శివ బండపల్లి ఉపసర్పంచ్ ఆరే అశోక్ మేకల వీరారెడ్డి బూస రాజయ్య తదితరు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు

# బెంగాల్‌లో 14 మంది బంగ్లాదేశీ పౌరులు అరెస్ట్.. నకిలీ ఆధార్ కార్డులు స్వాధీనం




కోల్‌కతా, ఏప్రిల్ 2: రైలులో ప్రయాణిస్తున్న బంగ్లాదేశ్ పౌరులను రైల్వే పోలీసులు గుర్తించారు. మహిళలు, పిల్లలతో సహా 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న ఆధార్ కార్డులు నకిలీ అని నిర్ధారించారు. పశ్చిమ బెంగాల్‌లోని జలపాయ్‌గురి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఢిల్లీ వెళ్తున్న నార్త్‌ఈస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో కొందరు అనుమానిత వ్యక్తులు ప్రయాణిస్తున్నట్లు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్)కు సమాచారం అందింది. దీంతో జలపాయ్‌గురి రోడ్డు స్టేషన్‌లో ఆ రైలును రైల్వే పోలీసులు తనిఖీ చేశారు.

కాగా, అనుమానిత వ్యక్తులుగా కనిపించిన 14 మందిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలు, నలుగురు పిల్లలు ఉన్నారు. వారిని బంగ్లాదేశ్ పౌరులుగా గుర్తించారు.మరోవైపు వారి వద్ద ఉన్న ఆధార్ కార్డులు నకిలీ అని రైల్వే పోలీసులు నిర్ధారించారు. దీంతో నకిలీ ఆధార్ కార్డులతో పాటు వారి వద్ద ఉన్న మలేషియా కరెన్సీ, మొబైల్ ఫోన్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పని కోసం జమ్ము కశ్మీర్ వెళ్తున్నట్లు వారు చెప్పారని రైల్వే పోలీస్ అధికారి తెలిపారు.

# వేవ్స్ 2025లో చౌకైన, అందరికీ అందుబాటులో ఉండే విద్యా సాంకేతిక పరిష్కారాలకు ఊతమిచ్చిన 'ఇన్నోవేట్ 2 ఎడ్యుకేట్' ఛాలెంజ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:విద్య, సాంకేతికతను సృజనాత్మకంగా అనుసంధానిస్తూ సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్ (సీఐసీ) మొదటి సీజన్‌లో భాగంగా 'ఇన్నోవేట్ 2 ఎడ్యుకేట్' పోటీని నిర్వహించారు. విద్యార్థులు, అంకుర సంస్థలు, ఆవిష్కర్తలు చేతితో పట్టుకోగలిగే సులభతరమైన అభ్యాస పరికరాలను రూపొందించడం, అభివృద్ధిపై ఈ ఛాలెంజ్ ప్రత్యేక దృష్టి సారించింది.

దృష్టి లోపం ఉన్నవారు, న్యూరో డైవర్జెంట్ అభ్యాసకుల వంటి విభిన్న అభ్యాస అవసరాలు గల పిల్లలతో సహా, వినూత్నమైన, అందరికీ అందుబాటులో ఉండే పరిష్కారాలను రూపొందించేందుకు పాల్గొనేవారిని ఈ పోటీ ప్రోత్సహించింది. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా విభిన్న నేపథ్యాలకు చెందిన విద్యార్థులు, ఆవిష్కర్తలు పాల్గొన్నారు. మంత్రిత్వ శాఖ మద్దతుతో ఒక పారిశ్రామిక సంఘం ఈ పోటీని నిర్వహించింది. పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, ఇతర సంస్థల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. అన్ని వర్గాల ప్రజలు ఇందులో భాగస్వాములయ్యేలా చూడటమే దీని ఉద్దేశ్యం.

ఈ పరికరాల తయారీలో వాడే హార్డ్‌వేర్ భాగాల ఖర్చు రూ. 1,000 మించకూడదని మార్గదర్శకాలను విధించారు. విద్యా సాంకేతికత సామాన్యులకు అందుబాటులో ధరలో ఉండేలా, పొదుపుతో కూడిన ఆవిష్కరణలను ప్రోత్సహించడమే దీని ప్రధాన ఉద్దేశం. ప్రాథమికంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ, వర్క్‌షాప్ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వారి పరిష్కారాలను మరింత మెరుగుపరిచి, పటిష్టమైన ఆవిష్కరణలుగా తీర్చిదిద్దారు.

దేశవ్యాప్తంగా వచ్చిన 1,800కి పైగా దరఖాస్తుల నుంచి పది మందిని ఫైనలిస్టులుగా ఎంపిక చేశారు. ఎంపికైన వారికి క్రియేటోస్ఫియర్, వేవ్స్ 2025 వేదికలపై తమ నమూనాలను ప్రదర్శించేందుకు, పరిశ్రమ నిపుణులతో చర్చించేందుకు అవకాశం కల్పించారు.

అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన మొదటి మూడు విజేత బృందాలకు వారి కృషి, ఆవిష్కరణలకు గుర్తింపుగా రూ. 50,000 వరకు నగదు బహుమతి అందించారు. ప్రదర్శించిన డిజైన్లు, నమూనాలు అందరికీ అందుబాటులో ఉండే, ఇంటరాక్టివ్ లెర్నింగ్, సాంకేతికత ఆధారిత విద్యా విధానాలపై సరికొత్త దృక్పథాలను ప్రతిబింబించాయి.

సదస్సు ముగిసిన తర్వాత ఫైనలిస్టులుగా నిలిచిన 10 బృందాల్లో 4 అంకుర సంస్థలుగా ఎదిగాయి. వీటిలో రెండు వేవెక్స్ స్టార్టప్ యాక్సిలరేటర్ కార్యక్రమం ద్వారా వ్యాపార ప్రోత్సాహక సౌకర్యాలను పొందే ప్రయత్నంలో ఉన్నాయి. వేవ్స్ బజార్ ప్రచార కార్యక్రమాల ద్వారా విజేతలు తమ ఆవిష్కరణలను భారీ స్థాయిలో విస్తరించేందుకు సంభావ్య పెట్టుబడిదారులతో చర్చించే అవకాశం లభించింది.

ఈ సమాచారాన్ని సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్ నేడు లోక్‌సభలో శ్రీ బసవరాజ్ బొమ్మై అడిగిన ప్రశ్నలకు సమాధానంగా లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు.

# 'ఎన్ఎఫ్‌డీసీ' ద్వారా చలనచిత్ర వ్యవస్థను బలోపేతం చేస్తున్న ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:దేశంలో చలనచిత్ర నిర్మాణ వ్యవస్థకు ప్రత్యక్ష మద్దతులో భాగంగా "డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ అండ్ డిసెమినేషన్ ఆఫ్ ఫిల్మిక్ కంటెంట్" (డీసీడీఎఫ్‌సీ) పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సహకరిస్తుంది.

ఈ కేంద్ర ప్రాయోజిత పథకం కింద 100 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వమే సమకూరుస్తుంది. చలనచిత్ర రంగంలో నాణ్యత పెంపు దిశగా ఈ నిధుల నుంచి ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందజేస్తుంది.

ఈ విధంగా 'డీసీడీఎఫ్‌సీ' పథకం కింద జాతీయ చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ (ఎన్ఎఫ్‌డీసీ) ద్వారా సినిమా నిర్మాణాన్ని ప్రభుత్వం సులభతరం చేస్తుంది. ఇందులో ప్రాంతీయ సినిమాలతోపాటు డాక్యుమెంటరీల నిర్మాణానికీ తోడ్పాటు లభిస్తుంది. దీనివల్ల దేశవ్యాప్తంగాగల స్థానిక సాంకేతిక నిపుణులు, కళాకారులు, సేవా ప్రదాతలకు ఉపాధి లభిస్తుంది.

గత సంవత్సరం ముంబయిలో 'వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్-2025) (ను ప్రభుత్వం నిర్వహించింది. ఇందులో భాగంగా "క్రియేట్ ఇన్ ఇండియా, క్రియేట్ ఫర్ ది వరల్డ్" కార్యక్రమం కింద పోటీలు ఏర్పాటు చేసింది. భారత్‌ను కంటెంట్ సృష్టికి ప్రపంచ కూడలిగా మార్చాలన్న ప్రభుత్వ దార్శనికత మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 100కు పైగా దేశాల నుంచి వచ్చిన కొనుగోలుదారులు, పెట్టుబడిదారులు, ఓటీటీ వేదికల నిర్వాహకులు సాంకేతిక అగ్రగాములు పాల్గొన్నారు. వీరందరితో మమేకం కావడం ద్వారా భారత కంటెంట్ సృష్టికర్తలు, నిర్మాతలు, అంకుర సంస్థలు తమ ప్రతిభకు పదును పెట్టుకునే వేదికగా ఇది నిలిచింది.

దీంతోపాటు ఆడియో-విజువల్ సహ నిర్మాణ ఒప్పందాలతో జాతీయ, అంతర్జాతీయ సంయుక్త కృషిని కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ ప్రాజెక్టులలో ప్రభుత్వ మద్దతుతోపాటు ప్రైవేట్ నిర్మాతల భాగస్వామ్యం కూడా ఉంటుంది.

భారతీయ ఆడియో-విజువల్ వ్యవస్థకు పెట్టుబడులు సహా ఆధునిక చలనచిత్ర నిర్మాణ పద్ధతులను పరిచయం చేస్తూ 'వీపీపీ' అనుగుణ నమూనాలో ఇవి పనిచేస్తాయి.

దేశీయ చలనచిత్రోత్సవాల నిర్వహణకు సహాయంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలు సిఫారసు చేసే ఉత్సవాలకు కేంద్రం నుంచి గ్రాంట్ లభిస్తుంది. 'క్యూరేటెడ్ ఫిల్మ్ ప్యాకేజీ'లు, మాస్టర్‌క్లాసులు, వర్క్‌షాప్‌ల నిర్వహణ ద్వారా కూడా అలాంటి ఉత్సవాలకు చేయూతనిస్తుంది. చలనచిత్ర పరిశ్రమ వ్యవస్థకు సాంకేతిక పరిజ్ఞాన ప్రదానం ద్వారా వివిధ రాష్ట్ర చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థలకు 'ఎన్ఎఫ్‌డీసీ' సహకరిస్తుంది. ఆయా రాష్ట్ర ప్రభుత్వాల స్థానిక చలనచిత్ర కంటెంట్ పరిరక్షణకూ మద్దతిస్తుంది. దేశంలోని అనేక రాష్ట్రాలు ఇప్పటికే తమ పారిశ్రామికాభివృద్ధి విధానాల కింద ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య నమూనా సహా సినిమా నిర్మాణ స్టూడియోల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నాయి.

కేంద్ర సమాచార-ప్రసార శాఖ మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్ ఈ రోజు పార్లమెంటులో డాక్టర్ శ్రీ తిరుమావళవన్ తొల్కాప్పియన్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ ప్రకటనను సభ ముందుంచారు.

# క్రీడలు సరికొత్త ఆశలను నింపుతున్నాయి

## ఖేలో ఇండియా గిరిజన క్రీడలు (కేఐటీజీ) 2026లో కేంద్ర సహాయ మంత్రి రక్షా ఖడ్సే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:ప్రస్తుతం జరుగుతున్న ఖేలో ఇండియా గిరిజన క్రీడలు (కేఐటీజీ) 2026లో భాగంగా యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సహాయ మంత్రి శ్రీమతి రక్షా ఖడ్సే ఈ రోజు రాయ్‌పూర్ ను సందర్శించారు. అక్కడి వాతావరణం నూతన శక్తితో, ఆశతో, మార్పుతో నిండి ఉందని ఆమె అభివర్ణించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ) బృందం చేసిన కృషిని ఆమె అభినందించారు. క్రీడాకారులు, స్థానిక సమాజం, ఆ ప్రాంత ప్రజల నుంచి స్పందన అత్యద్భుతంగా ఉందని ఆమె పేర్కొన్నారు.

అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 2,500 మందికి పైగా క్రీడాకారులు వివిధ విభాగాల్లో పోటీపడుతున్న ఈ కేఐటీజీ 2026, గిరిజన యువత తమ భవిష్యత్తును నిర్మించుకోవడానికి ఒక వేదికను కల్పించాలనే కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని శ్రీమతి రక్షా ఖడ్సే అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఈ క్రీడలు ఒక కొత్త ఆశను అందిస్తున్నాయని, వారి సామర్థ్యాన్ని గుర్తించి, అత్యున్నత స్థాయిలో ప్రోత్సాహం అందిస్తున్నామనే సంకేతాన్ని ఇస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.

''ఒకప్పుడు ఛత్తీస్‌గఢ్ నక్సలిజానికి పేరుగాంచింది. ఇక్కడి ప్రజలను వెనుకబడిన వర్గాలుగా భావించేవారు. కానీ ఈరోజు, ఈ ప్రాంతానికి ఒక కొత్త దిశ ఏర్పడుతోందని నేను భావిస్తున్నాను. నక్సలిజం అంతమైపోయింది. ఈ గడ్డపై ఉన్న యువతకు ఇప్పుడు క్రీడల ద్వారా తమ శక్తిని, సామర్థ్యాన్ని చాటుకుంటూ దేశం కోసం ఆడే అవకాశం లభించింది.'' అని మంత్రి పేర్కొన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతకు, దేశవ్యాప్తంగా నక్సలిజం అంతమైనట్టు ప్రకటించిన హోం మంత్రి శ్రీ అమిత్ షాకు, క్యాబినెట్ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయకు, కేఐటీజీ 2026ను ఒక మైలురాయిగా మార్చిన మొత్తం ఎస్ఏఐ బృందానికీ ఈ ఘనత చెందుతుందని మంత్రి వ్యాఖ్యానించారు. ఈ క్రీడల్లో పోటీపడుతున్న క్రీడాకారులలో చాలామంది భవిష్యత్తులో ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తారనే పూర్తి విశ్వాసాన్ని ఆమె వ్యక్తం చేశారు.

గ్రామీణ భారతదేశం నుంచి మహిళలను పోటీ క్రీడల్లోకి తీసుకురావడానికి, వారికి ఒక గుర్తింపును, అవకాశాన్ని కల్పించడానికి ప్రధానమంత్రి మోదీ దార్శనికతతో 2021లో ప్రారంభించిన అస్మిత లీగ్ ద్వారా వచ్చిన ప్రభావాన్ని కూడా మంత్రి శ్రీమతి రక్షా ఖడ్సే ప్రత్యేకంగా ప్రస్తావించారు."కేఐటీజీ 2026లో ఫలితా లు చాలా స్పష్టంగా ఉన్నాయి: హాకీ,ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొం టున్న బాలికల్లో సుమారు 60 నుంచి 70 శాతం మంది అస్మిత లీగ్‌లో పతకాలు సాధించిన పూర్వ క్రీడాకారులే. వారిలో అంజలి ముండా వంటి ప్రతిభావంతులు కూడా ఉన్నారు. అలాగే ఈ పోటీల్లో స్విమ్మింగ్‌లో వచ్చిన మొత్తం ఐదు స్వర్ణ పతకాలను కూడా అస్మిత లీగ్ క్రీడాకారులే కైవసం చేసుకున్నారు" అని మంత్రి శ్రీమతి రక్షా ఖడ్సే తెలిపారు. " మహిళా క్రీడాకారుల భాగస్వామ్యం నిరంతరం పెరిగేలా, అస్మిత లీగ్‌ను క్షేత్రస్థాయిలో గ్రామాలకు సైతం విస్తరించడానికి మా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి" అని ఆమె పేర్కొన్నారు

# 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ. 38,424 కోట్లకు చేరుకున్న రక్షణ ఎగుమతులు: గతేడాదితో పోలిస్తే 62.66 శాతం మేర పెరుగుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:ఆర్థిక సంవత్సరం 2025-26లో రక్షణ ఎగుమతులు రూ. 38,424 కోట్ల జీవన కాల గరిష్ఠ స్థాయిని చేరుకున్నాయి. గత ఆర్థిక సంవత్సర గణాంకాలు రూ. 23,622 కోట్లతో పోలిస్తే రూ. 14,802 కోట్లు (62.66 శాతం) భారీ పెరుగుదలను సూచిస్తోంది. ఈ చరిత్రాత్మక విజయంలో ప్రభుత్వ రంగ రక్షణ సంస్థలు (డీపీఎస్‌యూలు), ప్రైవేటు రంగం వరుసగా 54.84 శాతం, 45.16 శాతం మేర సహకారం అందించాయి. రక్షణ ఎగుమతులు చేస్తున్న అగ్రశ్రేణి దేశాల సరసన భారత్‌ను చేర్చాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ లక్ష్యానికి అనుగుణంగా భారత రక్షణ పరిశ్రమ ఈ విజయాన్ని సాధించింది.

రక్షణ ఉత్పత్తి విభాగం, భారతీయ రక్షణ ఉత్పత్తుల ఎగుమతిదారులు, ఇతర భాగస్వాముల పనితీరును రక్షణ మంత్రి శ్రీ రాజనాథ్ సింగ్ ప్రశంసించారు. రక్షణ పరికరాల తయారీలో ప్రపంచ కేంద్రంగా మారే దిశగా భారత్ ప్రయాణిస్తోందని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి మోదీ స్ఫూర్తిదాయక నాయకత్వంలో రక్షణ ఎగుమతుల్లో విజయగాథను భారత్ లిఖిస్తోందని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో రక్షణ మంత్రి పేర్కొన్నారు.

గతేడాదితో పోలిస్తే డీపీఎస్‌యూల ఎగుమతులు 151 శాతం మేర పెరిగాయి. 14 శాతం పెరుగుదలను నమోదు చేస్తూ ప్రైవేటు సంస్థలు తమ ఉనికిని చాటుకున్నాయి. వాటా విలువ పరంగా చూస్తే ప్రైవేటు రంగం రూ.17,353 కోట్ల ఎగుమతులు చేయగా, డీపీఎస్‌యూలు రూ. 21,071 కోట్లు అందించాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఈ గణాంకాలు వరుసగా రూ. 15,233 కోట్లు, రూ. 8,389 కోట్లుగా ఉన్నాయి.

గత అయిదేళ్లలో మూడు రెట్లు పెరుగుదలను ఈ రికార్డు స్థాయి గణాంకాలు సూచిస్తున్నాయి.

భారత్‌లో తయారైన రక్షణ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండును, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో ఈ రంగానికి పెరుగుతున్న వాటాను ఈ గణనీయమైన పెరుగుదల సూచిస్తోంది. వ్యవస్థలు/ఉప వ్యవస్థల విషయంలో విజయవంతమైన అంతర్జాతీయ భాగస్వామిగా ఉండటంతో పాటు 2025-26 ఆర్థిక సంవత్సరం నాటికి 80కి పైగా దేశాలకు రక్షణ పరికరాలను భారత్ ఎగుమతి చేస్తోంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే.. ఎగుమతిదారుల సంఖ్య 128 నుంచి 145కు పెరిగింది. ఈ పెరుగుదల 13.3 శాతంగా ఉంది.

# రుద్రంపూర్‌లో ఘనంగా బోనాల వేడుకలు

నల్గొండ, ఏప్రిల్ 2:భక్తి శ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో రుద్రంపూర్‌లో గల శ్రీ గుండాల సాయమ్మ తల్లి ఆలయంలో చుక్క బోనం కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. "ఆపదల నుండి రక్షించు, వైపరీత్యాలను దూరం చేయి, మా కోరికలు నెరవేర్చు అమ్మ" అంటూ భక్తులు అమ్మవారిని ప్రార్థిస్తూ బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమం ఆలయ పూజారి రవికుమార్ ఆధ్వర్యంలో జరిగింది. పూజారి ఇంటి నుండి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న జీకే ఓసి వ్యాలీ రోడ్డులోని అమ్మవారి గుడి వరకు డప్పు వాయిద్యాల నడుమ, శివశక్తుల పూనకాలతో భక్తులు ఊరేగింపుగా చేరుకున్నారు. మార్గమంతా అమ్మవారి జై జైకారాలతో మారుమోగింది. గుడి వద్దకు చేరుకున్న అనంతరం భక్తులు చుక్క బోనం, ఘనంకుండ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేసి, పెద్ద సంఖ్యలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ బోనాల వేడుకలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పగా, భక్తుల విశ్వాసం, అంకితభావం ప్రతిబింబించింది.

# నిరుపేద యువతి వివాహానికి ఆర్థిక సాయం

ఆదిలాబాద్, ఏప్రిల్ 2: తాండూరు గ్రామంలో పేదింటి ఆడపడుచు కంపెల మమత వివాహానికి మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ గురువారం రూ.5 వేల ఆర్థిక సాయం ( ఈతినిజీనిఇతిజీశ్రీ ఐబబతిబబిజీనిఇవ ) అందించి దాతృత్వం చాటుకున్నారు. సర్పంచ్ ముడిమడుగుల సురేష్ రూ.2 వేలు, ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ రూ.3వేలు, వార్డు సభ్యులు భాగ్యలక్ష్మి సారయ్య రూ. వెయ్యి సాయంగా అందించారు.

వార్డు సభ్యులు పెట్టెం విష్ణుకళ్యాణ్, ఎండీ జుబేర్, సింగరావ్ శ్రీధర్, పురంశెట్టి అరుణ్ పులగం శ్రీకాంత్ రూ. 5వేల ఎయిర్ కూలర్ విరాళంగా అందించి యువతి కుటుంబానికి ఆసరాగా నిలిచారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ ఈసా, వార్డు సభ్యులు, నాయకులు, మైనార్టీ నాయకులు పాల్గొని వధువును ఆశీర్వదించారు.

# అక్రమ ఎల్పీజీ గ్యాస్ దందా గుట్టురట్టు.. 45 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం



న్యూఢిల్లీ: ఎల్పీజీ గ్యాస్ కొరత నేపథ్యంలో అక్రమ ఎల్పీజీ గ్యాస్ దందా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఒక వాహనంతో పాటు 45 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. (ఎశ్రీశ్రీవణజీశ్రీ ఒఖఉ ఖీజీఇఎవబి) దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది.

మార్చి 28న ఉదయం 7:00 గంటల సమయంలో హెడ్ కానిస్టేబుల్ రాజేష్ గస్తీ విధుల్లో ఉన్నారు. పాలంలోని ఒక నివాస ప్రాంతంలో గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వచేసినట్లు ఆయనకు సమాచారం అందింది.

కాగా, ఎస్ఐ ఆర్పీ మీనా నేతృత్వంలోని పోలీస్ బృందం వెంటనే అక్కడకు చేరుకున్నారు. అక్కడి స్థలాన్ని తనిఖీ చేశారు. వాహనం లోపల, బయట భారత్ గ్యాస్‌కు చెందిన గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్లను పెద్ద సంఖ్యలో నిల్వ ఉంచినట్లు గుర్తించారు. అక్రమంగా రీఫిల్లింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయని గ్రహించారు.

మరోవైపు ఆ వాహనంతో పాటు 45 గ్యాస్ సిలిండర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న సత్యవీర్, అసిస్టెంట్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న వికాస్ కుమార్, వాహనం డ్రైవర్ అనార్ సింగ్‌ను అరెస్ట్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# ప్రసార రంగాన్ని మార్చేస్తోన్న డిజిటల్ రేడియో, డైరెక్ట్-టు-మొబైల్ సాంకేతికత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:డిజిటల్ రేడియో, డైరెక్ట్-టు-మొబైల్ (డీటూఎం) సాంకేతికతలు స్పెక్ట్రమ్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా ఒకే ఫ్రీక్వెన్సీపై బహుళ ఛానళ్లను అందిస్తూ ప్రసారం రంగంలో (మాస్ కమ్యూనికేషన్) విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నాయి. తక్కువ ధరలో ఉచిత ప్రసార వ్యవస్థను డిజిటల్ రేడియో అందిస్తోంది. దీనిని మరింత విస్తరిస్తూ డీటూఎం సాంకేతికత ద్వారా సిమ్ కార్డు లేదా మొబైల్ డేటాతో సంబంధం లేకుండా నేరుగా మొబైల్ హ్యాండ్‌సెట్‌లకు వీడియో, ఆడియో, డేటాను ప్రసారం చేయొచ్చు. ఇది తక్కువ ఖర్చుతో కూడిన వినోదం, విద్య, అత్యవసర విపత్తు నిర్వహణ హెచ్చరికలను అందించడానికి ఒక బలమైన సమాచార వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది.

టీసీసీసీపీఆర్ (టెలికాం కమర్షియల్ కమ్యూనికేషన్స్ కస్టమర్ ప్రిఫరెన్స్ రెగ్యులేషన్స్) ప్రకారం వాణిజ్య సంస్థలకు సంబంధించిన అవసరం లేని సమాచారం (యూసీసీ) లేదా స్పామ్ కాల్‌లను ట్రాయ్ (టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) నియంత్రిస్తోంది. యూసీసీని అరికట్టే లక్ష్యంతో ట్రాయ్ డీఎల్‌టీ (డిస్ట్రిబ్యూటెడ్ లెడ్జర్ టెక్నాలజీ) అనే బ్లాక్‌చైన్ ఆధారిత ప్లాట్‌ఫామ్‌ను తీసుకొచ్చింది. దీని ద్వారా వినియోగదారులు ప్రచార సందేశాలకు సంబంధించి తమ ఇష్టాయిష్టాలను నమోదు చేసుకోవచ్చు. బ్యాంకులు, బీమా కంపెనీలు, విమానయాన కంపెనీలు వంటి ప్రధాన సంస్థలతో (ప్రిన్సిపల్ ఎంటిటీస్) పాటు టెలిమార్కెటర్లు కూడా ఈ డీఎల్‌టీ ప్లాట్‌ఫామ్‌లో తప్పనిసరిగా నమోదు కావాలి. దీనితో పాటు నమోదు అయిన, నమోదు కాని టెలిమార్కెటర్లపై ఫిర్యాదు చేయడానికి ఈ ప్లాట్‌ఫామ్‌లో ఒక ప్రత్యేక ఫిర్యాదుల వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇది వివిధ సర్వీస్ ప్రొవైడర్ల మధ్య ఫిర్యాదుల సమాచారాన్ని వేగంగా చేరవేస్తూ తగిన చర్యలు తీసుకోవడానికి సహకరిస్తుంది.

ఎప్పటికప్పుడు తగిన విధానపరమైన మార్గదర్శకాలను జారీ చేయడం ద్వారా ప్రసార రంగంలో వర్ధమాన సాంకేతికతలను సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రోత్సహిస్తోంది. బీఐఎన్‌డీ (బ్రాడ్‌కాస్టింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ నెట్‌వర్క్ డెవలప్‌మెంట్) అనేది ఒక కేంద్ర రంగ పథకం. దీని ద్వారా దూరదర్శన్, ఆకాశవాణిల మౌలిక సదుపాయాలను ఆధునీకీకరించడం, మెరుగుపరచడం చేస్తున్నారు. ఈ పథకం కింద ప్రసార భారతి నిరంతరం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఆకాశవాణి, దూరదర్శన్ నెట్‌వర్క్‌లను నవీకరిస్తోంది. ఇందులో భాగంగా నెట్‌వర్క్ డిజిటలైజేషన్, సరికొత్త సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపడుతున్నారు.

శ్రీ రావు రాజేంద్ర సింగ్ అడిగిన ప్రశ్నలకు సమాధానంగా సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ ఈ రోజు లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం రూపంలో ఈ వివరాలను అందించారు.

# వంద శాతం కాన్పులు ప్రభుత్వ దవాఖానలోనే చేయాలి : కలెక్టర్ అనురాగ్ జయంతి



నల్గొండ, ఏప్రిల్ 2: వంద శాతం కాన్పులు ప్రభుత్వ దవాఖానాల్లోనే అయ్యే విధంగా వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఫార్మసీ స్టోర్‌ను పరిశీలించి అన్ని మందులు ఉన్నాయా.. అన్ని మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం రిజిస్ట్రేషన్, ఓపీ, ల్యాబ్‌ను పరిశీలించారు. దవాఖాన భవనంను, డ్రైనేజి వ్యవస్థను పరిశీలించి వెంటనే మరమతులు చేపట్టాలని టీఎస్ ఐఎండీసీ డీఈని ఆదేశించారు. దవాఖాన పరిధిలోని పీహెచ్‌సీల వైద్యులు. ఏఎన్ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

గత సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానాల్లో జరిగిన కాన్పుల వివరాలను పీహెచ్‌సీల వారీగా సమీక్షించారు. 50 శాతం కన్న ఎక్కువ కాన్పులు ప్రైవేటు దవాఖానాల్లోనే జరగడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. డీసీహెచ్, డీఎంహెచ్‌లు ప్రతినెల మొదటి వారంలో కాన్పులపై సమీక్ష సమావేశం నిర్వహించి రిపోర్టు తనకు అందజేయాలని ఆదేశించారు. దవాఖాన ప్రాగణంలో చెట్లను పెట్టి సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ గరిక సత్యనారాయణకు సూచించారు. కలెక్టర్ వెంట డీసీ హెచ్ఎస్ చిన్నా నాయక్, బాఎంహెచ్ఓ మనోహార్, తాసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ రాములు, దవాఖాన సూపరింటెండెంట్ శ్వేత ప్రియాంక ఉన్నారు.

# ప్రైవేటు ఆస్పత్రి నిర్వాకం.. ఫోన్ ద్వారా డెలివరీ చేసిన డాక్టర్.. తల్లీ, శిశువు మృతి

ఉత్తర ప్రదేశ్, ఏప్రిల్ 2: వైద్యుల నిర్లక్ష్యానికి పరాకాష్ట ఈ ఘటన. డెలివరీ కోసం ఓ గర్భిణి ప్రైవేటు ఆస్పత్రికి వస్తే ఫోన్ ద్వారా సూచనలిచ్చి డెలివరీ చేసింది ఓ లేడీ డాక్టర్. ఈ ఘటనలో ఆ తల్లి సహా అప్పుడే పుట్టిన బిడ్డ కూడా మరణించింది. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్, అయోధ్య జిల్లాలోని ఫైజాబాద్‌లో మంగళవారం రాత్రి జరిగింది. ఈ ఘటనపై మృతురాలి భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేనిగంజ్‌కు చెందిన సురేష్ యాదవ్ భార్య సోని యాదవ్‌కు పురిటి నొప్పులు రావడంతో మంగళవారం ఫైజాబాద్‌లోని మా పరమేశ్వరి దేవి మెమోరియల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ ఆమెను అంజలి శ్రీవాస్తవ అనే లేడీ డాక్టర్ పరీక్షించింది. సోని యాదవ్ ఆరోగ్య స్థితి మామూలుగానే ఉందని చెప్పింది. ఆ తర్వాత సోనికి డెలివరీ చేసే సమయానికి ఆ డాక్టర్ అందుబాటులో లేదు. దీంతో ఆమె ఫోన్‌లోనే ఇతర వైద్య సిబ్బందికి సూచనలిచ్చి డెలివరీ చేయించింది. వారికి సరైన అనుభవం లేకపోవడం వల్ల, డెలివరీ సమయంలో తలెత్తిన సమస్యల కారణంగా ఆ మహిళ, అప్పుడే పుట్టిన బిడ్డ మరణించారు. డెలివరీ జరిగిన కొద్ది సేపటికి బిడ్డ శ్వాస తీసుకోవడం లేదని సురేష్ యాదవ్‌కు చెప్పారు. దీంతో సురేష్ యాదవ్ అప్పుడే పుట్టిన ఆ బిడ్డను తీసుకుని వేరే ఆస్పత్రికి వెళ్లి పరీక్షించగా, అప్పటికే శిశువు మరణించినట్లు చెప్పారు. ఇక, ఆస్పత్రికి తిరిగొచ్చేసరికి అతడి భార్య సోని పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలిపారు.

దీంతో ఆమెను కూడా వేరే ఆస్పత్రికి చికిత్స కోసం తరలించగా, ఆమె కూడా మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే బాలింత, నవజాత శిశువు మరణించారని బాధిత కుటుంబం ఆరోపించింది. వైద్యాధికారులకు కూడా దీనిపై ఫిర్యాదు చేశారు. వారు ఆస్పత్రిని పరిశీలించారు. సోనికి వైద్య సేవలో లోపాలున్నట్లు గుర్తించారు. డాక్టర్, ఇతర సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఇద్దరూ మరణించినట్లు తేలింది. దీంతో ఆస్పత్రిని సీజ్ చేశారు. అయితే, ఈ ఘటనపై సోని భర్త సురేష్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు.

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తలారి యాదయ్య

నల్గొండ, ఏప్రిల్ 2:తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నల్లగొండ పట్టణానికి చెందిన తలారి యాదయ్యను నియమిస్తూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేయగా నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ కారులకు న్యాయం జరిగే వరకు ఉద్యమించాలని కోరారు. ఈ ఎన్నికకు కృషి చేసిన రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ రావు, ఉమ్మడి జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్‌కు తలారి యాదయ్య ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీయూఎఫ్ నాయకులు వల్కి వెంకటేశం, పీయు జేఏసీ నాయకులు వై.రాంబాబు యాదవ్, గంజి రాజేందర్, లెక్చరర్లు, డీ.మహేందర్, సుధాకర్, పెండెం ధనుంజయ, గంజి వెంకన్న, సీనియర్ ఉద్యమకారులు రేఖలు భిక్షం పాల్గొన్నారు.

# పరమ పవిత్రం.. త్యాగ నిరతికి శాశ్వత చిహ్నం 'శుభ శుక్రవారం'

మానవాళి పాప విమోచన కోసం, లోక క్షేమార్థం తన ప్రాణాన్నే అర్పించిన ప్రేమ స్వరూపుడు, దైవ కుమారుడు యేసు క్రీస్తు శిలువ మరణాన్ని స్మరించుకునే అత్యంత పవిత్ర దినమే 'గుడ్ ఫ్రైడే' లేదా 'శుభ శుక్రవారం'. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో, ఉపవాస దీక్షలతో, మౌన ప్రార్థనలతో ఆచరించే ఈ రోజు కేవలం విషాదాన్ని సూచించేది మాత్రమే కాదు; అపారమైన త్యాగం, క్షమ, నిస్వార్థ ప్రేమకు ప్రతీకగా నిలుస్తుంది. సుమారు రెండు వేల సంవత్సరాల క్రితం కల్వరి గిరిపై జరిగిన ఆ రక్తసాక్షి ఘట్టం, నేడు ప్రపంచంలో అతిపెద్ద మతంగా ఎదిగిన క్రైస్తవ ధర్మానికి మూలస్తంభంగా నిలిచింది.

ప్రాచీన మత చరిత్రను పరిశీలిస్తే, యూదుల మతం అయిన యూద మతం క్రీపూ 2000 సంవత్సరాల నాటికే రూపుదిద్దుకుంది. అదే కాలంలో భారత దేశంలో వేద సంస్కృతి విస్తరించి ఉంది. యూదుల పవిత్ర గ్రంథమైన పాత నిబంధనలోని ఆది, నిర్గమ, లేవీయ, సంఖ్యా, ద్వితీయోపదేశ గ్రంథాలు వారి ధర్మశాస్త్రానికి మూలాధారాలు. అయితే కాలక్రమేణా ఆచార వ్యవస్థలు సంక్లిష్టమై, ఆత్మీయత కంటే బాహ్యాచారాలకు ప్రాధాన్యం పెరిగింది. సామాజిక అసమానతలు, పేదలపై నిర్లక్ష్యం, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష, దేవుని పేరిట యాగబలులు వంటి ఆచారాలు విస్తరించాయి. ఆధ్యాత్మిక సారాంశం క్రమంగా క్షీణించిన ఈ కాలంలోనే ప్రవక్తల ప్రవచనాలను నెరవేర్చుతూ కన్య మరియు గర్భంలో జన్మించిన యేసు క్రీస్తు మానవ చరిత్రలో ఒక నూతన దశను ఆరంభిం చారు.

యేసు బాల్యం నుంచే ఆధ్యాత్మిక దృక్పథంతో పెరిగి, సమాజంలోని అణగారిన వర్గాలకు ఆదరణగా నిలిచారు. పాపులుగా ముద్రపడిన వారిని సమాజంలో తిరిగి స్థాపించేందుకు కృషి చేశారు. "పాపాన్ని ద్వేషించు, పాపిని కాదు" అనే ఆయన బోధనలో మానవతా దృక్పథం ప్రతిబింబిస్తుంది. కఠినమైన ధర్మశాస్త్రాలను ప్రేమ, క్షమ, కరుణ అనే మానవీయ విలువలతో సరళీకరించి కొత్త నిబంధనగా బోధించారు. ఆయన ఉపదేశాలు సామాన్య ప్రజలను ఆకర్షించగా, అప్పటి మతాధికారులు, రాజకీయ పాలకులకు అవి సవాలుగా మారాయి. ముఖ్యంగా రోమనుల పాలనలో ఉన్న యూదేయాలో ఆయన ప్రభావం పెరుగుతుండటంతో, ఆయనపై కుట్రలు పన్నబడ్డాయి.

చివరకు క్రీశ 30-33 ప్రాంతంలో ఒక శుక్రవారం రోజున యేసును అరెస్టు చేసి, విచారణ పేరుతో అవమానించి, దైవద్రోహిగా ముద్రవేసి శిలువ వేయించారు. ఈ ఘటనకు రోమనుల పాలకుడు పొంతియుస్ పైలేట్ అధికారిక అనుమతి ఇచ్చినట్లు సువార్తలు పేర్కొంటాయి. కల్వరి లేదా గోల్గొథా అనే ప్రదేశంలో ఆయనకు ముళ్ల కిరీటం పెట్టి, కొరడాలతో హింసించి, చేతులు కాళ్లకు మేకులు పొడిచి శిలువపై నిలబెట్టారు. మానవునిగా తీవ్రమైన శారీరక వేదనను అనుభవిస్తున్నప్పటికీ, "తండ్రీ, వీరిని క్షమించు; వీరేమి చేయుచున్నారో వీరికి తెలియదు" అని ప్రార్థించడం ఆయన దైవత్వాన్ని చాటిచెప్పింది. శత్రువులను క్షమించడం




అనే అత్యున్నత నైతిక విలువను ప్రపంచానికి ఆయన ఆచరణలో చూపించారు.

శిలువపై మరణం సాధారణంగా అపమానకరమైన శిక్షగా భావించ బడేది. అయినప్పటికీ ఆ మరణాన్ని 'గుడ్ ఫ్రైడే'గా ఎందుకు పిలుస్తారన్న ప్రశ్నకు లోతైన ఆధ్యాత్మిక అర్థం ఉంది. మానవాళి చేసిన పాపాలకు పరిహారంగా దేవుడు తన కుమారుడిని బలిగా అర్పించి, విమోచన మార్గాన్ని తెరిచాడనే విశ్వాసం క్రైస్తవ సిద్ధాంతానికి కేంద్రబిందువుగా నిలుస్తుంది. 'గుడ్' అనే పదం ఇక్కడ శుభప్రదం, మంగళకరం అనే భావాన్ని సూచిస్తుంది. మరణం ద్వారానే జీవం, బాధ ద్వారానే విమోచనం సాధ్యమని ఈ రోజు సూచిస్తుంది. కొన్ని సంప్రదాయాల్లో దీనిని 'గాడ్స్ ఫ్రైడే', 'హోలీ ఫ్రైడే', 'గ్రేట్ ఫ్రైడే' అని కూడా పిలుస్తారు.

గుడ్ ఫ్రైడేకు ముందు నలభై రోజుల పాటు క్రైస్తవులు 'లెంట్' అనే ఉపవాస కాలాన్ని ఆచరిస్తారు. ఇది ఆత్మ పరిశీలన, పశ్చాత్తాపం, ఆధ్యాత్మిక శుద్ధికి ప్రతీక. ఈ కాలంలో అనేక మంది భౌతిక సుఖాలను త్యజించి, ప్రార్థనలకు ప్రాధాన్యం ఇస్తారు. గుడ్ ఫ్రైడే రోజున చర్చిలలో ప్రత్యేక ఆరాధనలు జరుగుతాయి. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు యేసు శిలువపై గడిపిన సమయంగా భావించి, మౌన ప్రార్థనలు నిర్వహిస్తారు. 'ఏడు మాటలు' (Seven Last Words) అనే ధ్యాన ప్రసంగాలు వినిపిస్తారు. ఈ రోజు వివాహాలు, వేడుకలు వంటి శుభకార్యాలు నివారించ బడతాయి. ఆహారంలో కూడా నియమాలు పాటిస్తూ, కొంతమంది పూర్తిగా ఉపవాసం ఉంటారు. ఈ ఆచారాలన్నీ మానవుడి లోపల ఆత్మపరిశీలనను మేల్కొల్పడమే లక్ష్యంగా ఉంటాయి.

యేసు మరణంతో కథ ముగియలేదు. బైబిల్ ప్రకారం, ఆయన శిలువ వేయబడిన మూడవ రోజు తిరిగి లేచారు. దీనినే ఈస్టర్ ఆదివారంగా ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. ఈ పునరుత్థానం క్రైస్తవ విశ్వాసానికి ప్రాణాధారం. మరణంపై జీవం గెలిచిందనే సంకేతం ఇది. గుడ్ ఫ్రైడే నాటి విషాదం, ఈస్టర్ నాటి ఆనందంతో సమతుల్యమవుతుంది. ఈస్టర్ సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ఇది ఆశ, నూతన జీవితం, ఆధ్యాత్మిక పునర్జన్మకు చిహ్నంగా నిలుస్తుంది.

ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవ మతం విస్తృతి విశేషమైనది. సుమారు 240 కోట్లకు పైగా ప్రజలు క్రైస్తవ విశ్వాసాన్ని అనుసరిస్తున్నారు, ఇది ప్రపంచ జనాభాలో దాదాపు మూడో వంతు. యేసు బోధించిన ప్రేమ, శాంతి, సేవా తత్వాలు ప్రపంచ మానవీయ విలువల రూపకల్పనలో కీలక పాత్ర పోషించాయి. విద్యా, వైద్య రంగాలలో క్రైస్తవ మిషనరీల సేవలు విశేషమైనవి. అనేక పాఠశాలలు, ఆసుపత్రులు స్థాపించి సమాజ సేవలో నిలిచాయి. మానవ సేవే మాధవ సేవ అన్న భావనను కార్యరూపంలో చూపించాయి.

యేసు క్రీస్తు కేవలం ఒక మత గురువుగా మాత్రమే కాకుండా, సమాజ సంస్కర్తగా, శాంతి దూతగా నిలిచారు. ఆయన బోధించిన "నీ పొరుగువానిని నీవలె ప్రేమించు" అనే సందేశం కాలాతీతమైనది. ద్వేషం, హింస, అసహనం పెరుగుతున్న ఆధునిక ప్రపంచంలో ఆయన చూపిన క్షమాగుణం అత్యంత ప్రాసంగికం.

శత్రువుని క్షమించడం, బాధను ప్రేమతో ఎదుర్కొనడం, త్యాగం ద్వారా సత్యాన్ని నిలబెట్టడం...ఈ విలువలన్నీ గుడ్ ఫ్రైడే సందేశంలో అంతర్లీనంగా ఉన్నాయి.

అంతిమంగా, శుభ శుక్రవారం మనకు నేర్పే పాఠం ఎంతో గంభీరమైనది. త్యాగం ద్వారానే మహత్తరమైన మార్పులు సాధ్యమవుతాయి;

ప్రేమ ద్వారానే మానవ హృదయాలను గెలుచుకోవచ్చు. యేసు క్రీస్తు చూపిన మార్గం కేవలం ఒక మతానికి మాత్రమే పరిమితం కాదు, అది సమస్త మానవాళికి మార్గదర్శకం. ఈ పవిత్ర దినాన ఆయన త్యాగాన్ని స్మరించుకుంటూ, మన జీవితాలలో కరుణ, క్షమ, సేవా భావాలను ఆచరణలో పెట్టడం ద్వారా ఆయనకు నిజమైన నివాళి అర్పించవచ్చు.



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# ప్రజా పాలనతో అర్హులైన ప్రతీ ఒక్కరికి న్యాయం

## -కౌన్సిలర్ తూము మధు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 2: నేటినిజం (ప్రతినిధి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన' ప్రణాళికలో భాగంగా గురువారం స్థానిక వార్డులో ప్రత్యేక అవగాహన



కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, రాతపూర్వక దరఖాస్తులను స్వీకరించారు. ముఖ్యంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం వర్తించని వారు, అలాగే రూ. 500 గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పొందని లబ్ధిదారుల నుండి వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తూము మధు మాట్లాడుతూ అర్హత ఉండి పథకాలు అందని ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే ఈ ప్రజా పాలన ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వార్డు ఆఫీసర్ పరశురాములు, ఎంఎంసి డైరెక్టర్ ఎస్కె సాబీర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గోడిసేల రేణుక శ్రీనివాస్, చొప్పరి భాస్కర్, ఎస్కె పర్వీన్ తదితరులు పాల్గొని ప్రజల ఫిర్యాదులను స్వీకరించారు. ఆశా వర్కర్లు లత, భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, మున్సిపల్ సిబ్బంది నిమ్మిశెట్టి శేఖర్ ఈ కార్యక్రమంలో భాగస్వాములై దరఖాస్తుల ప్రక్రియను పర్యవేక్షించారు. వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

# జోడు హనుమాన్ సేవలో బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 2: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం జోడు హనుమాన్ దేవాలయంలో గురువారం చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఘనంగా లక్ష్మి నరసింహ స్వామి బండ్ల జాతర

## - భక్తులకు ఆయిరా ట్రేడర్స్ యజమాని ఎజాజ్ ఉద్దీన్ త్రాగునీటి వసతి



కరీంనగర్, ఏప్రిల్ 2::(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ జిల్లా చెర్లబుత్కూర్ గ్రామంలో గురువారం శ్రీ బూనీల చెన్నకేశవ లక్ష్మి నరసింహ స్వామి బండ్ల జాతర గరుడసేవ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్‌కు చెందిన ఆయిరా ట్రేడర్స్ యజమాని ఎజాజ్ ఉద్దీన్ త్రాగునీటి వసతి కల్పించారు. ఈ సందర్భంగా ఎజాజ్ ఉద్దీన్ మాట్లాడుతూ పండుగలు, సంతోషకర కార్యక్రమాలు ఆనందంగా జరుపుకోవాలని, తెలంగాణ అంటేనే గంగ-జమున తహజీబ్‌కు ప్రతీక అని తెలిపారు. మత భేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, రాబోయే తరాలకు కూడా మంచి విలువలు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూర నరేష్ రెడ్డి, ఉప సర్పంచ్ బరిబద్దల మధుకర్, బీసీ సెల్ అధ్యక్షుడు న్యాలం రాజు గౌడ్, చెర్లబుత్కూర్ వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జోడు హనుమాన్ కు ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు

వేములవాడ, ఏప్రిల్ 02: వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం జోడు హనుమాన్ దేవాలయంలో గురువారం చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ప్రభుత్వ విప్ కు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

# భక్తిశ్రద్ధలతో ఘనంగా హన్‌మాన్ జయంతి వేడుకలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 2:మండల కేంద్రం కుభీర్‌తో పాటు పలు గ్రామాలల్లో హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉదయం నుంచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుభీర్‌లో 25 అడుగుల ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గ్రామంలోని వీధుల గుండా ఊరేగించారు.

ఈ సందర్భంగా భజనలు, మేళతాళాలతో శోభాయాత్ర కన్నుల పండువగా కొనసాగింది, అంజన్న నామస్మరణతో పాటు శ్రీరామ నామ నామస్మరణతో గ్రామాలు దద్దరిల్లాయి. యువకులు కాషాయ వస్త్రాలు ధరించి వీధుల గుండా కాషాయ జెండాలను ఎగురవేశారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. శోభాయాత్రలో బీఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యులు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్, లోలం శ్యాంసుందర్, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, నముద్రాల వేణుగోపాల చారి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎన్నిల అనిల్, మాజీ మార్కుఫెడ్ డైరెక్టర్ రేకుల గంగా చరణ్, నాగభూషణ్ (మణి),మండల నాయకులు, యువకులు, పాల్గొన్నారు.

# జై భీమ్ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 2: నేటినిజం (ప్రతినిధి): :కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం రోజున కరీంనగర్లోని అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన నిర్వహిస్తున్న భీమ్ యాత్ర పోస్టర్ ను ఏప్రిల్ మాసం అంటేనే మహనీయులు జన్మించిన పవిత్ర మాసం అని అన్నారు. మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్ లు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ మాసంలో మహనీయులైనటువంటి బాబా సాహెబ్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిభాపులే, బాబు జగ్జీవన్ రామ్ లాంటి మహానుభావులు జన్మించిన పవిత్ర మాసం అని కులమతాలకతీతంగాగొప్పగా ప్రజలందరూ వారి జయంతి వేడుకలను దేశవ్యాప్తంగా జరుపుకుంటారని, వారి ఆశయాలకనుగుణంగా నేటి యువత ఆ మహనీయులను ఆదర్శంగా తీసుకొని ముందు కెళ్లాలని ఆకాంక్షించారు. అంబేద్కర్ యూత్ అధ్వర్యంలో. గత ఐదు ఏళ్లుగా అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని నగరంలోని కిసాన్ నగర్ నుండి కోర్ట్ సర్కిల్ లోని అంబేద్కర్ విగ్రహం వరకు చేపట్టే యాత్రలో ప్రతి ఒక్కరు భాగస్వాములై యాత్రను విజయవంతం చేయాలన్నారు. వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత రాజ్యాంగం పటిష్ట స్థితిలో ఉండడానికి కారణం డా బి ఆర్ అంబేద్కర్ అని వారి



కృషితోనే దేశంలో ప్రజాస్వామ్య పద్ధతిలో నాయకులను ఎన్నుకోగలుతున్నామన్నారు. మన రాజ్యాంగాన్ని చూసి పలు దేశాలు వాటి రాజ్యాంగాన్ని రచించుకున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 14న సాయంత్రం జరిగే జై భీమ్ యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తో పాటు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లు పొన్నం అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, కార్పొరేటర్ గడ్డి ప్రదీప్,కొత్తపల్లి మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్,మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కర్ర సూర్యశేఖర్, మాజీ సుడా డైరెక్టర్ నేతి రవివర్మ, నాయకులు మిడిదొడ్డి నవీన్, అంబేద్కర్ యూత్ సభ్యులు కొమ్ముల కరుణాకర్, లింగంపెల్లి రాజేష్, పులిపాక సాయికుమార్, కళ్ళపెల్లి నవీన్, గసికంటి దీపక్, బోనా సాగర్, మల్యాల కిరణ్, వేదిర వామన్, దాసరపు వంశీ ప్రణయ్, మడక అరవింద్ పాల్గొన్నారు.

# డిజైన్ కెరీర్ వైపునకు విద్యార్థులకు ఆహ్వానం

## -ఈనెల 11, 12వ తేదీలలో ప్రవేశ పరీక్ష

హైదరాబాద్, ఏప్రిల్ 2:: ఇంటర్ తర్వాత ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి సంప్రదాయ కోర్సుల వైపు ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తారు. అయితే, సైన్స్, కామర్స్, ఆర్ట్స్ నేపథ్యాల నుంచి వచ్చే యువతీ యువకులను డిజైన్, టెక్నాలజీ, క్రియేటివ్ ఎకానమీలో అభివృద్ధి చెందుతున్న కెరీర్ అవకాశాలను



అన్వేషించాల్సిందిగా వరల్డ్ యూనివర్సిటీ ఆఫ్ డిజైన్ (డబ్ల్యుయూడీ) ఆహ్వానిస్తోంది. 2026-27 విద్యా సంవత్సరానికి టెక్నాలజీ, సృజనాత్మకతతో వినూత్న కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ఈనెల 11, 12వ తేదీల్లో ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష నిర్వహించనుంది.

ఇందులో అర్హత సాధించిన అభ్యర్థులకు తదుపరి దశలో క్యాంపస్ ఇంటర్వ్యూ ఉంటుంది. వేగంగా మారుతున్న ఈ కాలంలో వృత్తిపరమైన విజయం అనేది కేవలం పాఠశాలలో చదివిన సబ్జెక్టులకే పరిమితం కావడం లేదు. సృజనాత్మకతను సాంకేతికతతో, వ్యాపారంతో, మానవ కేంద్రీకృత ఆవిష్కరణలతో అనుసంధానించే శక్తివంతమైన రంగంగా డిజైన్ అవతరించింది. ఇది విభిన్న ఆసక్తులు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులకు అపారమైన అవకాశాలను కల్పిస్తోంది. ఈ మార్పుకు అనుగుణంగా ఈ యూనివర్సిటీ తన అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌ల కోసం 2026?27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభించింది. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తుకు సిద్ధం చేసే ఇంటర్ డిసిప్లినరీ (అంతర్-విభాగ) విద్యను ఈ విశ్వవిద్యాలయం అందిస్తోంది. డిజైన్, బిజినెస్, ఆర్కిటెక్చర్, ఫ్యాషన్, కమ్యూనికేషన్, విజువల్ & పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌లో వైవిధ్యమైన ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుత పరిశ్రమ డిమాండ్‌లను ప్రతిబింబించేలా, ముఖ్యంగా మాస్టర్స్ ప్రోగ్రామ్‌ల పాఠ్య ప్రణాళికను సమగ్రంగా అప్‌గ్రేడ్ చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను మేళవించడం, పరిశ్రమ ఆధారిత ప్రాజెక్టులు, ఎన్ఈపీ 2020కి అనుగుణంగా ఫ్లెక్సిబుల్ అకడమిక్ మార్గాలను ఈ యూనివర్సిటీ అందిస్తోంది. డబ్ల్యుయూడీ ఆప్టిట్యూడ్ టెస్ట్ (డబ్ల్యుయూడీఏటీ) 2026 ద్వారా నిర్వహించబడతాయి.

# సరికొత్తగా.. సూపర్‌ఫుడ్స్‌తో హార్లిక్స్

## - బాదం, ఓట్స్, చిరుధాన్యాలు, మాల్టెడ్ బార్లీ మిశ్రమంతో..

హైదరాబాద్, ఏప్రిల్ 2:ఇప్పుడు అందరికీ ఆరోగ్యం పట్ల స్పృహ పెరిగింది. అందుకే ఆరోగ్యకర ఆహారానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ తరుణంలో హిందుస్థాన్ యూనీలీవర్ లిమిటెడ్ 'హార్లిక్స్ సూపర్‌ఫుడ్స్'ను తీసుకొచ్చింది. ఈ సరికొత్త హార్లిక్స్ మాల్టెడ్ బార్లీ, చిరుధాన్యాలు, ఓట్స్, బాదం వంటి సూపర్‌ఫుడ్స్ మిశ్రమంతో రూపొందించబడింది. ఈ పదార్థాలు అధిక పోషక విలువలకు, రోజువారీ ఆరోగ్యాన్ని మెరుగురచడానికి ప్రసిద్ధి చెందాయి. తరతరాలుగా ప్రాచుర్యం పొందిన హార్లిక్స్ రుచిని అలాగే ఉంచుతూ.. పోషక ప్రభావాన్ని పెంచేలా అధునాతన సైన్స్‌ను ఇందులో జోడించింది. ఇందులో ముఖ్యంగా సొంత న్యూట్రిమ్యాక్స్ టెక్నాలజీ. ఐరన్, జింక్ వంటి కీలక ఖనిజాల శక్తిని శరీరానికి అందకుండా అడ్డుపడే ఫైటేట్స్ వంటి యాంటీ-న్యూట్రియెంట్లను తగ్గించడానికి ఈ




ప్రత్యేక ప్రక్రియ సహాయపడుతుంది. ఈ అధునాతన ప్రాసెసింగ్ ద్వారా కరిగే, కరగని ఫైబర్ పరిమాణం పెరుగుతుంది. ఇది జీర్ణక్రియ ఆరోగ్యానికి తోడ్పడటమే కాకుండా శరీరం అవసరమైన పోషకాలను సమర్థవంతంగా గ్రహించేలా చేస్తుంది. హార్లిక్స్ సూపర్‌ఫుడ్స్ కరిగే డైటరీ ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, అవసరమైన సూక్ష్మపోషకాలు, ప్రోటీన్‌తో కూడిన సంపూర్ణ పోషకాహారాన్ని అందిస్తుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఇది పిల్లల్లో అనారోగ్యాన్ని 30 శాతం వరకు తగ్గిస్తుందని క్లినికల్‌గా నిరూపించబడింది. పిల్లలు ఎత్తుగా పెరగడానికి, దృఢమైన ఎముకలను పొందడానికి, జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి ఇది తోడ్పడుతుందని నిరూపితమైంది. కొత్త హార్లిక్స్ అదనపు చక్కెర లేని 'జీరో యాడెడ్ షుగర్' వేరియంట్‌లో కూడా లభిస్తుంది. ఇందులోని 'స్మార్ట్ స్వీట్‌నెస్' టెక్నాలజీ, చక్కెర లేదా కృత్రిమ తీపి పదార్థాలను ఉపయోగించకుండానే, మాల్టెడ్ బార్లీ నుంచి వచ్చే సహజమైన తీపిని పెంచి పాత రుచినే అందిస్తుంది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: BAISA DEVADAS.